ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి


తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -307 పేజీలు - 08 వెల - 04/-

మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# నా ఆలోచనంతా వ్యవసాయంపైనే

## వ్యవసాయంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు



- నేను ఐటీ గురించి మాట్లాడినా వ్యవసాయంపైనే ఆలోచన: సీఎం చంద్రబాబు
- మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులుండాలి
- రసాయన ఎరువుల ఎక్కువ వినియోగంతో ప్రజారోగ్యం, పంట ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- రూ. 1000 కోట్ల భారమైనా ఆక్వాను ఆదుకునేలా చర్యలు
- వ్యవసాయ, ఉద్యాన రంగాలపై సభలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**అమరావతి, సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
"నేను ఐటీ గురించే మాట్లాడతానని అనుకుంటారు. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని. నేను చేసిన పనులన్నీ రైతులకు ఉపకరించేవే. నీరు-చెట్టు, రిజర్వాయర్లు, చెక్ డ్యాములు, కాలువలు ఇలా ప్రతీ అంశాన్నీ వ్యవసాయ రంగానికి అనుకూలమైన ఆలోచనలే చేశాను. సాగునీరు, వ్యవసాయ రంగం అభివృద్ధికే నిర్ణయాలు తీసుకున్నాను. రైతు బజార్లు, మొబైల్ రైతు బజార్లలో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేలా చేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం అసెంబ్లీలో వ్యవసాయ శాఖపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే వ్యవసాయశాఖ పరంగా తీసుకుంటున్న నిర్ణయాలు, రైతులకు లబ్ది చేకూర్చిన అంశాలను చెప్పడంతో పాటు భవిష్యత్తులో రైతు సంక్షేమం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నామనే విషయాలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి నిర్ణయమూ రైతు కోసమే తీసుకుంటున్నానని, వ్యవసాయాన్ని లాభదాయకం చేసే అంశం మీదే ప్రతి నిమిషం ఆలోచిస్తున్నానని స్పష్టం చేశారు. వ్యవసాయం మీద ఆధారపడే ఆర్థిక వ్యవస్థ మనది. అందుకే ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలని నిర్ణయించామని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర దక్కేలా చూస్తున్నామని అన్నారు. మిగతా 2లో...




# స్వదేశీ ఉత్పత్తులనే విక్రయించండి

- జీఎస్టీ సంస్కరణలు... లేఖను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- ఈరోజు నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ పండుగ మొదలైందని వెల్లడి
- జీఎస్టీ సంస్కరణలు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయన్న మోదీ
- ప్రజలు స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న నరేంద్ర మోదీ

# పరకామణి చోరీపై సిట్ విచారణ

- చోరీ జరిగిన మరుసటి రోజే ఛార్జ్‌షీట్
- అంతా అనుమానంగా ఉందన్నమంత్రి లోకేశ్
- ప్రైవేట్ మెడికల్ కాళాశాలలపై పిపిపి విధానం



**అమరావతి సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**పరకామణి చోరీపై త్వరలో సిట్ విచారణకు నియమిస్తామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. పరకామణి చోరీ దొంగలను దేవుడు కూడా వదలలేదని.. అందుకనే బయటకు వచ్చిందన్నారు. సోమవారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. అసలు తిరుమల ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటం ఏమిటి.. అసలు నెయ్యిలో నెయ్యే లేదని తేల్చారని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 29 ఏప్రిల్ 2023న రాత్రి 11 గంటలకు తిరుపతి పరకామణిలో చోరీ జరిగిందని.. మరుసటి రోజు వెంటనే చార్జిషీట్ వేశారని.. అంటే వెంటనే చార్జిషీట్ సిద్ధం చేసుకున్నారని తెలిపారు. మిగతా 2లో...

# కలెక్షన్లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదా?

- పసికందు మృతి...
- ప్రభుత్వంపై జగన్ ఫైర్
- కుయ్ కుయ్ మూగబోతోందంటూ జగన్ విమర్శ
- పసికందు మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్




# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి సందడి

- అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు
- యేడు 20లక్షల మంది వస్తారని అంచనా
- హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

**విజయవాడ, సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
ఈ ఏడాది దుర్గమ్మ దర్శనానికి సుమారు 20 లక్షల మంది వస్తారని అంచనా వేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం దసరా ఉత్సవాల తొలిరోజు కావడంతో విజయవాడ నగరంలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మిగతా 2లో...



# జీఎస్టీ నష్టాన్ని కేంద్రమే భరించాలి

- సింగరేణి కార్మికులకు రూ.819 కోట్లు బోనస్
- కాంట్రాక్ట్ కార్మికులకు కూడా..
- రాష్ట్రం రూ.7వేల కోట్లు నష్టపోతుంది
- మొత్తం లాభాలు రూ.6,394 కోట్లు
- కొత్త ప్రాజెక్టుల కోసం రూ.4,034 కోట్లు
- లాభాల వాటా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

2లో.



# డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి పవన్ ను ఆహ్వానించిన లోకేశ్



- ఈ నెల 25న డీఎస్సీ నియామక పత్రాల అందజేత...
- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్‌తో మంత్రి లోకేశ్ భేటీ
- పలు అంశాలపై ఇరువురు నేతల మధ్య సంభాషణ

**అమరావతి సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సభా కార్యక్రమాలకు విరామం ఇచ్చిన సమయంలో వీరిద్దరూ భేటీ అయి పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలో ఇటీవల పూర్తయిన మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి పవన్ కల్యాణ్‌ను మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. ఈ నెల 25వ తేదీన డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ కొలువుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన తుది ఎంపిక జాబితాను సెప్టెంబర్ 15న విడుదల చేసిన విషయం తెలిసిందే.

పవన్ ను కలిసి సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ... గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకపోగా, మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు దాదాపు 106 కేసులు వేశారని తెలిపారు. మిగతా 2లో...

# కాలుష్యకారక పరిశ్రమలపై దృష్టి పెట్టాల్సిందే

- పారిశ్రామికవేత్తలు పారిపోయేలా ఉండరాదు
- పెసిబిని అడ్డం పెట్టుకుని వ్యక్తిగత ప్రయోజనాలు
- అధికారులను అప్రమత్తం చేసిన డిప్యూటీ సిఎం పవన్




# వారోత్సవాల వేళ మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ...

## ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత హతం?

- ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్
- భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి
- మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు వికల్ప్
- ఘటనా స్థలం నుంచి ఏకే-47 రైఫిల్ స్వాధీనం

**అమరావతి సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మిగతా 2లో...



# నా ఆలోచనంతా వ్యవసాయంపైనే

(మొదటి పేజీ తరువాయి)

అందుకే రకరకాల పంటలను ప్రోత్సహిస్తున్నామని, ఆక్వాను ప్రోత్సహిస్తున్నామని, వ్యవసాయాన్ని ఓ పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏ పంట వేస్తే గిట్టుబాటు ఉంటుందో చూసి ఆ పంటలు వేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

"ప్రతీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నెలకు ఒక్క రోజు పొలం దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడాలి. అక్టోబరు నుంచి ప్రతీ నెలా రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు విని పరిష్కారం చేస్తాం. ఈ మేరకు కార్యాచరణ రూపొందిస్తాం. ప్రజా ప్రతినిధులు రైతుల వద్దకు వెళ్లి... ప్రభుత్వం రైతుల గురించి ఎలాంటి ఆలోచన చేస్తోంది... వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని వివరించాలి. ప్రతీ ప్రజా ప్రతినిధి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. పురుగు మందులు, ఎరువుల వాడకంలో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ ఉంది. తెగుళ్లను గుర్తించి నివారణ చర్యల కోసం డ్రోన్లను వాడొచ్చు.

అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల ఆక్వాలో అగ్రస్థానంలో ఉన్న ఏపీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. రైతులకు సంపద రావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సాగు ఖర్చులు తగ్గించడానికి సాంకేతికతతో రైతును ఆదుకుంటాం" అని స్పష్టం చేశారు.

"రైతులకు వాస్తవాలు చెప్పి పురుగుమందులు, ఎరువులు వాడుతుంటే వారికి అవగాహన కల్పించాలి. వరదలు, వర్షాలతో ఎరువు కొట్టుకుపోవటం వల్ల బూస్టర్ డోస్ ఇచ్చారు. రాష్ట్రంలో 1.16 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది అదనంగా పంట వేశారు. 25 శాతం మేర యూరియా ఎక్కువ వినియోగించారు. దాణా పెంచడానికి కూడా యూరియాను వినియోగించుకున్నారు. ఖరీఫ్ సీజన్ కు 16.70 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియా అలాట్మెంట్ వచ్చింది. ప్రస్తుతం 5.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రంలో అందుబాటులో ఉంది. యూరియా ఎక్కువ వినియోగించటం వల్ల పాలు కూడా కలుషితం అవుతున్నాయి. యూకలిప్టస్, పసుపు లాంటి పంటలకు కూడా యూరియా వాడేస్తున్నారు. రాష్ట్రంలో హెక్టారుకు సగటున 255 కేజీల మేర యూరియా వినియోగం జరుగుతోంది. తద్వారా భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. భూసారం కూడా దెబ్బతింటోంది.

ప్రజారోగ్యంతో పాటు పంట ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతోంది. కొత్త తెగుళ్లతో పంటలు దెబ్బతింటున్నాయి. రసాయనాలు, యూరియా అధిక వినియోగంపై రైతుల్ని చైతన్యపర్చాల్సి ఉంది. ఫెర్టిలైజర్ల వినియోగం వల్ల మార్కెట్ ఉండదు. పీఎం ప్రణామ్ కింద రసాయన ఎరువుల వినియోగం తగ్గించిన రైతులకు రూ.800 సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాకే బదిలీ చేస్తాం. టెస్టింగ్ అండ్ ట్రేసింగ్ వల్ల రైతులు నష్టపోకూడదు. బాధ్యతలేని నాయకులు ఎరువులు ఇవ్వలేదని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. సర్టిఫికేషన్ ఇచ్చిన ఆహారాన్నే తీసుకుంటున్న ఆ నేతలు రైతులను మోసగిస్తున్నారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న రైతు ప్రభుత్వం కూటమిది. రైతులు ఉత్పత్తి చేసే పంటలపై శ్రద్ధపెట్టాలి, సేంద్రీయ ఎరువులు ఉపయోగించి, రసాయన పురుగు మందులు తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులు పండిద్దాం" అని చంద్రబాబు చెప్పారు.

"సమర్థ నీటి నిర్వహణ కారణంగా అన్ని రిజర్వాయర్లల్లో నీటితో కళకళలాడుతున్నాయి. నెల్లూరులో ఎప్పుడూ ఒక పంటే వేస్తారు. ఈసారి అక్కడ రెండు పంటలు వేశారు. రైతులకు సమృద్ధిగా నీరు అందుతుండడంతో పంటలు విరివిగా వేస్తున్నారు. అదే దిశలో మేమూ రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటున్నాం. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో వేస్తున్నాం. తొలి విడతగా రూ.7 వేల చొప్పున మొత్తంగా రూ.3,173 కోట్లు రైతుల ఖాతాలో వేశాం. ఉల్లి ధరలు పడిపోతే హెక్టారుకు రూ.50 వేల నష్ట పరిహారం ప్రకటించాం. ఈ స్థాయిలో ఉల్లి పంటకు నష్టపరిహారం గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. అలాగే టమాటో ధర పడిపోయినా ప్రభుత్వం 1267 మెట్రిక్ టన్నుల టమాటాలను కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. మామిడికి రూ.194 కోట్ల మేర అదనంగా చెల్లింపులు చేసి రైతును ఆదుకున్నాం. మిర్చి, కోకో, పత్తి, పొగాకు రైతులను అన్ని రకాలుగా ఆదుకున్నాం. ప్రకృతి సేద్యాన్ని కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ప్రతీ ఎకరాకూ నీటిని ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాం.

అగ్రిటెక్ లో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణకు ఎక్కువ ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. కిసాన్ డ్రోన్స్ ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నాం. రుతుపవనాల కారణంగా ఈసారి చాలా చోట్ల భారీ వర్షాలు కురిశాయి. మైక్రో ఇరిగేషన్, డ్రిప్ ఇరిగేషన్ లో ఏపీ దేశంలోనే నెంబర్ వన్ గా ఉంది. అనంతపురంలో అమలు చేసిన మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ ను నమూనాగా తీసుకుని ప్రధాని మోదీ గుజరాత్ లో అమలు చేశారు. అందుకే దేశంలో ఈ రెండు రాష్ట్రాలు మైక్రో ఇరిగేషన్ రంగంలో అగ్రస్థానంలో ఉన్నాయి. 90 శాతం సబ్సీడిని మైక్రో ఇరిగేషన్ వినియోగించే రైతులకు అందిస్తున్నాం. మైక్రో ఇరిగేషన్ ద్వారా లక్ష హెక్టార్లకు 15 టీఎంసీల నీరు ఆదా అవుతుంది. ఏడేళ్లలో 105 టీఎంసీల నీరు ఆదా అయినట్టే. అలాగే రూ 434 కోట్ల విలువైన 10,871 లక్షల కిలోవాట్ల విద్యుత్ ఆదా అవుతుంది. అలాగే 364 లక్షల పని దినాలు కూడా ఆదా చేసుకున్నట్టే. దీని విలువే రూ.1820 కోట్ల మేర ఉంటుంది. 35 వేల టన్నుల యూరియా కూడా రైతులకు ఆదా అవుతుంది. మొత్తంగా రూ.8 వేల కోట్ల అదనపు ఆదాయాన్ని రైతులు సాధించినట్టే. ఉద్యాన రంగానికి సంబంధించి క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఫుడ్ ప్రాసెసింగ్ పైనా ప్రధానంగా దృష్టి పెట్టాం. ఈ రంగంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా గరిష్టంగా ఆదాయం సాధించే అవకాశం ఉంది" అని చంద్రబాబు వివరించారు.

## పరకామణి చోరీపై సిట్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

పైగా ఇంత పెద్ద నేరానికి 41 సీఆర్పీసీ నోటీస్ ఇచ్చారన్నారన్నారు. ఇప్పుడు దేవుడే బయటకు తీశారని అన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేట్‌పరం చేయడం లేదని.. కేవలం పీపీపీ మోడ్‌లో వెళ్తున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. రోడ్లు కూడా అదే విధానంలో చేస్తున్నామని అన్నారు. పులివెందులలో జగన్ కనీసం కాలేజీ కట్టలేదన్నారు. దీనిపై అసెంబ్లీ, శాసన మండలిలో ప్రభుత్వ వైఖరి స్పష్టం చేస్తామని చెప్పారు. అమ్మ అన్నం పెట్టదు... అడుక్కు తిననివ్వదు అన్నట్టు- జగన్ వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. 1994లో చంద్రబాబు కాంగ్రెస్ వారి మాట వినుంటే స్టేట్‌లో ఇన్ని ఇంజనీరింగ్ కళాశాలలు వచ్చేవా అని ప్రశ్నించారు. అదే ప్రిజనరీ, విజనరీకి ఉన్న తేడా అని అన్నారు. విశాఖకు త్వరలో టీసీఎస్ వస్తుందని.. ఇప్పటికే టీసీఎస్‌లో రిక్రూట్‌మెంట్ ప్రారంభమైందని తెలిపారు. జీఎస్టీ కొత్త విధానం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని.. దీని ద్వారా సొసైటీ-లోకి డబ్బు వస్తుందన్నారు. అలాగే ఆర్థిక పురోగతి ఉంటు-ందని... ఫలితంగా పన్ను చెల్లింపు కూడా ఉంటుందని వెల్లడించారు. మూడు నెలల్లో కాలేజీ ఫీజ్ రీయింబర్స్ మెంట్ మూడు బకాయిలు వెంటనే చెల్లిస్తామని ప్రకటించారు. జగన్ హయాంలోని మూడు నెలలు బకాయిలు ఏం చేయాలనేది త్వరలోనే నిర్ణయిస్తామని తెలిపారు. తమ హయాంలో ఉన్న మూడు నెలలు క్లియర్ చేసి ఆ తరువాత -టైమ్ షెడ్యూల్‌లో ఇచ్చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రతీ విద్యా సంవత్సరం ప్రారంభంలో డీఎస్సీ ఉంటుందని ప్రకటించారు. పరిశ్రమలకు అవగాహన ఒప్పందం చేసుకోవడం కాదని.. వెంటనే గ్రౌండ్ చేయడంపై దృష్టి పెట్టామన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాము మూడు సూత్రాలు చెబుతున్నామని చెప్పారు. చంద్రబాబు విజినరీ, సమర్థ నాయకత్వం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌లను తాము విదేశాల్లో చెబుతున్నామన్నారు. టీసీఎస్‌కు మిలీనియం బ్లాక్‌లో ఇచ్చామని... మిగతా కంపెనీలకూ తాము అలానే ఇస్తున్నామని తెలిపారు.?

## కలెక్షన్లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదా?

### పసికందు మృతి... ప్రభుత్వంపై జగన్ ఫైర్

అమరావతి **సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి** 108 అంబులెన్స్ సరైన సమయానికి రాకపోవడంతో ఓ పసికందు ప్రాణాలు కోల్పోయిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అత్యవసర సేవలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఘటనకు సంబంధించిన వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసి, ప్రభుత్వ తీరును తప్పుబట్టారు."కుయ్.. కుయ్.. మూగబోతోంది. ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చే 108 సర్వీసులకు చంద్రబాబు ప్రభుత్వం ఉరివేస్తోంది. పాడేరు సమీపంలోని ముల్లుమెట్టకు చెందిన నిండు గర్భిణీని ఆస్పత్రికి తరలించేందుకు 108 రాకపోవడంతో ఆటోను ఆశ్రయించాల్సి వచ్చింది. చివరకు ఆటోలోనే ప్రసవం జరిగింది. వైద్యం అందక ఆటోలోనే శిశువు మరణించింది. వైసీపీ హయాంలో అంబులెన్స్‌లు, పట్టణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 15 నిమిషాల్లోగా 108 రావాలన్న నిబంధన ఉంటే, దాన్ని అధిగమిస్తూ 12-14 నిమిషాల్లోనే చేరుకునేవి. గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో చేరుకోవాలని నిబంధన ఉంటే, 16-17 నిమిషాల్లోనూ, గిరిజన ప్రాంతాల్లో 30 నిమిషాల్లో చేరుకోవాలని నిబంధన ఉంటే, దీన్నికూడా అధిగమిస్తూ 22 నిమిషాల్లోనే చేరుకుని 108లు సేవలందించాయి. మరి ఎందుకు ఇప్పుడు చేరుకోవడం లేదు? ఫోన్ చేసినా ఎందుకు రావడం లేదు? ప్రభుత్వం అన్నది పనిచేస్తేనేకదా! కలెక్షన్ల మీద తప్ప ప్రజలమీద ధ్యాస ఉంటేకదా!" అని విమర్శించారు.

## స్వదేశీ ఉత్పత్తులనే విక్రయించండి

**● జీఎస్టీ సంస్కరణలు... లేఖను విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలపై ఒక లేఖను విడుదల చేశారు. ఈరోజు నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ పండుగ ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలు రాబోయే తరాల ప్రజల్లో పొదుపును పెంచుతాయని ఆయన అన్నారు. ఈ సంస్కరణల ద్వారా రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులు, ఎంఎస్ఎంఈలతో సహా అన్ని వర్గాల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుందని హామీ ఇచ్చారు.జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధితో పాటు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని, ప్రతి రాష్ట్రం యొక్క ప్రగతిని వేగవంతం చేస్తాయని ఆయన వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ సరళీకృతం కావడంతో పాటు వ్యాపార నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. తమ ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా కొన్నేళ్లలోనే 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు.ఆదాయపు పన్నును రూ. 12 లక్షల వరకు మినహాయించడం, జీఎస్టీ సంస్కరణల వంటి కార్యక్రమాలతో ప్రజలకు ఒక్క ఏడాదిలోనే రూ. 2.50 లక్షల కోట్ల డబ్బు ఆదా కానుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు స్థానిక తయారీ రంగాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. దుకాణదారులు స్వదేశీ తయారీ ఉత్పత్తులనే విక్రయించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్రాలు పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

## వారోత్సవాల వేళ మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ...

(మొదటి పేజీ తరువాయి)


ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వికల్ప్ కూడా ఉన్నట్లు బలమైన ప్రచారం జరుగుతోంది.వివరాల్లోకి వెళితే, నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో ఒకరు కీలక నేత వికల్ప్ అని అధికారులు అనుమానిస్తున్నారు.ఈ ఘటనపై బస్తర్ ఐజీ సుందర్ రాజ్ స్పందించారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తో పాటు మరికొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన ధృవీకరించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని, ఆపరేషన్ పూర్తయ్యాక మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. పార్టీ వారోత్సవాల సమయంలో కీలక నేత హతమయ్యాడన్న వార్త మావోయిస్టు వర్గాల్లో కలకలం రేపుతోంది.

## డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి పవన్ ను ఆహ్వానించిన లోకేశ్

**(మొదటి పేజీ తరువాయి)** కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట నిలుపుకుందని అన్నారు. దీనివల్ల ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ టీచర్ల కలలు సాకారం అయ్యాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ, పురపాలక, గిరిజన సంక్షేమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీ కోసం ఈ ఏడాది ఏప్రిల్ 20న ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 6 నుంచి జులై 2 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. అనంతరం టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ, ధృవపత్రాల పరిశీలన పూర్తి చేసి తుది జాబితాను రూపొందించారు.ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థుల వివరాలు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్, విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. నియామక ప్రక్రియ చివరి అంకానికి చేరుకోవడంతో, అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది.

## ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి సందడి

(మొదటి పేజీ తరువాయి)



ఎపి మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, తదితరులు దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం అనిత మీడియాతో మాట్లాడుతూ ... తెలుగు ప్రజలందరికీ ఆమె దసరా ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. అంగరంగ వైభవంగా అమ్మవారి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. జనాల కోసం తగిన ఏర్పాట్లు- చేశామని, మొత్తం 36 విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు- చేశారని, 4,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు- చేసినట్లు- వివరించారు.


# జీఎస్టీ నష్టాన్నికేంద్రమే భరించాలి

### సింగరేణి కార్మికులకు రూ.819 కోట్లు బోనస్ -కాంట్రాక్ట్ కార్మికులకు కూడా..

హైదరాబాద్ **సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

జీఎస్టీ శ్లాబు రేట్ల కుదింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.7వేల కోట్ల ఆదాయా న్ని కోల్పోతుందనీ, దాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని రాష్ట్రాలపై భారం వేయడం సరికాదనీ, వచ్చే ఐదేండ్ల వరకు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటన కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటాలో 34 శాతాన్ని బోనస్‌గా ప్రకటిం చారు. దీనికోసం రూ.819 కోట్లు కేటాయిం చామని వివరిం చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సంస్థ మొత్తం నికర లాభాలు రూ. 6,394 కోట్లు కాగా, దానిలో కొత్త ప్రాజెక్టుల కోసం 4,034 కోట్లు కేటాయించామని చెప్పారు. మిగిలిన రూ.2,360 కోట్లు నికర లాభాల్లో 34 శాతం సొమ్మును (రూ.819 కోట్లు) లాభాల వాటా బోనస్‌గా చెల్లిస్తున్నామని చెప్పారు. సంస్థలోని 41 వేల మంది పర్మినెంట్ కార్మికులకు సగటున ఒక్కొక్కరికి రూ. 1,95,610 లక్షలు బోనస్‌గా వస్తుం దనీ, గతేడాదితో పోలిస్తే రూ.8,289 అధికంగా బోనస్ చెల్లిస్తున్నామన్నారు.

అలాగే సంస్థలోని 30 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ ఇస్తామన్నారు. గత ఏడాది వీరికి రూ.5వేలు చొప్పున బోనస్ చెల్లించామని తెలిపారు. తెలంగాణలో గనులన్నీ సింగరేణికే దక్కేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్ కాస్ట్ బ్లాకులను



వేలంపాటలో ప్రయివేటు వ్యక్తులు పొందారనీ, ఇది సింగరేణికి తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టిందని చెప్పారు. వీటిని కూడా సింగరేణికి కేటాయించాలని కార్మికులు కోరారనీ, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆ ప్రయత్నం చేస్తామన్నారు. ప్రయివేటు సంస్థలతో ధీటుగా సింగరేణి సంస్థ అభివృద్ధి చెందాలనీ, దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఓపెన్ మార్కెట్లో ఇతరుల కంటే తక్కువ ధరకు బొగ్గు అమ్మే స్థాయికి సంస్థ ఎదగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంపాటలో పాల్గొని కొత్త బ్లాకులు సాధించాలని సింగరేణికి దిశానిర్దేశం చేశారు. కీలక ఖనిజాన్వేషణ రంగంలో సంస్థ ముందడుగు వేసిందని అభినందించారు. సంస్థ భవిష్యత్ విస్తరణ, అభివృద్ధి కోసం నికర లాభాల్లో రూ. 4,034 కోట్లు కొత్త ప్రాజెక్టుల కోసం కేటాయించామన్నారు. సంస్థ అభివృద్ధికి కార్మికులు, కార్మిక సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వాగతోపన్యాసం చేసిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఒడిశా రాష్ట్రంలో నైని బ్లాకును సాధించామనీ, కీలక ఖనిజాన్వేషణ రంగంలోకి ప్రవేశించామని తెలిపారు. కేంద్రం నిర్వహించే కొత్త బ్లాకుల వేలంలో కొత్త కొత్త బొగ్గు బ్లాకుల్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ 2వేల సంవత్సరం నుంచి లాభాల వాటా బోనస్‌ను కార్మికులకు చెల్లిస్తున్నదని తెలిపారు. ఏటా ఆ శాతం పెరుగుతూ వస్తున్నదని చెప్పారు. కోల్ ఇండియా ప్రకటించే బోనస్‌ను దీపావళికి పంపిణీ చేస్తామన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాలరావు, షబ్బీర్ అలీ, పార్లమెంటు సభ్యులు పి. బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, శ్రీమతి మట్టా రాగమయి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ, గడ్డం వినోద్, దానం నాగేందర్, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్ జనక్‌ప్రసాద్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహులు, సింగరేణి డైరెక్టర్లు కే వెంకటేశ్వర్లు, ఎం తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్ మెంట్ బి వెంకన్న, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్ టి. శ్రీనివాస్, జనరల్ మేనేజర్ పర్సనల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కాలుష్యకారక పరిశ్రమలపై దృష్టి పెట్టాల్సిందే

### పారిశ్రామివేత్తలు పారిపోయేలా ఉండరాదు

### పిసిబిని అడ్డం పెట్టుకుని వ్యక్తిగత ప్రయోజనాలు

### అధికారులను అప్రమత్తం చేసిన డిప్యూటి సిఎం పవన్

అమరావతి **సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి** పీసీబీని అడ్డుపెట్టుకొని వ్యక్తిగత ప్రయోజనాలు పొందాలని భావించే వారి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. పెట్టుబడులను ప్రోత్సహిస్తూనే.. కాలుష్యాన్ని నియంత్రించేలా ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. కానీ, పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి తీసుకురాకూడదని తెలిపారు. అటవీ,



పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శితో అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో పవన్ సమావేశమయ్యారు. తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేసిన ఆరోపణలపై మరోసారి సమీక్షించారు. గత ప్రభుత్వంలో అలాంటి తప్పిదాలు చోటు- చేసుకున్నాయని గుర్తు చేశారు. ఎల్జీ పాలిమర్స్ లాంటి సంస్థలలో చోటు- చేసుకున్న ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. విశాఖ ప్రాంతంలో ఫార్మా సంస్థలు ఉన్నాయని, వాటిలో కాలుష్య నియంత్రణ నిబంధనల అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనల అమలులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించిన తొలి రోజుల్లోనే పీసీబీపై సమీక్షించి దిశా నిర్దేశర చేశామని వ్యాఖ్యానించారు. భావితరాలకు సాధ్యమైనంత స్వచ్ఛమైన గాలి, నీరు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలిని బలోపేతం చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది విధులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పీసీబీని అడ్డుపెట్టు-కొని వ్యక్తిగత ప్రయోజనాలను పొందాలని భావించేవారి

విషయంలో జాగరూకతతో వ్యవహరించాలని దిశానిర్దేశర చేశారు. ఏపీలో పెట్టుబడులను ప్రోత్సహిస్తూనే... కాలుష్యాన్ని నియంత్రించేలా ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశర చేశారు పవన్ కల్యాణ్. అలా అని పారిశ్రామికవేత్తలను పారిపోయే పరిస్థితి తీసుకురాకూడదని చెప్పుకొచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# పిజిఆర్ఎస్ అర్జీదారులతో కలసి కలెక్టర్ భోజనం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 22:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో పాల్గొన్న అర్జీదారులతో జిల్లా కలెక్టర్ శ్రీమతి జి.రాజకుమారి కలిసి భోజనం చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల కోసం శ్రీ కాశిరెడ్డి నాయన సత్రం ఓంకారం వారి ఆధ్వర్యంలో అందజేసే ఉచిత భోజన కార్యక్రమంలో అర్జీదారులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. అర్జీదారులతో భోజనం చేస్తూ వారి సమస్యలను నేరుగా విని స్పందించిన కలెక్టర్, అధికార యంత్రాంగం%–%ప్రజల మధ్య దూరాన్ని తగ్గించడం ద్వారా సేవా దృక్పథం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని ఆమె తెలిపారు. అర్జీదారులతో కలసి భోజనం చేయడం ద్వారా అధికార యంత్రాంగం మరియు ప్రజల మధ్య దూరాన్ని



తగ్గించడం లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రజలతో భోజనం పంచుకోవడం ద్వారా వారి మనసులోని మాటలు నేరుగా వినే అవకాశం కలుగుతుంది. ఇది ప్రజా సేవలో పారదర్శకతను మరింత బలపరుస్తుంది" అని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా బేతంచెర్ల మండలం, ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన మధుశేఖర్ గౌడ్ సర్వే నెంబరులో 961/బి2లో పాత ఆర్ఎస్ ప్రకారం 7.62 ఎకరాల భూమిని గత నాలుగు తరాలుగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నానని, అయితే తన పొలం వెనుక ఉన్న వారు వారి పొలంలోకి వెళ్ళడానికి మా పొలంలో సదరు కొంత భాగాన్ని రాస్తగా మార్చి వినియోగించుకోవడం జరుగుతోందన్నారు. సంబంధిత పొలం రస్తా వివాదం కోర్టులో ఉందని, సదరు కోర్టు తీర్పు ఇచ్చే వరకు మీ పొలంలో వారు తిరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం కలెక్టర్ తెలిపారు. సంబంధిత వ్యక్తుల పొలాలను స్వయంగా పరిశీలించి వెనుక ఉన్నవారు పొలంలోకి వెళ్లేలా ప్రత్యామ్నాయ మార్గం చూపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబంలోని వ్యక్తులతో కలిసి భోజనం చేస్తూ చిన్నారులను కలెక్టర్ అప్యాయంగా పలకరించారు. భవిష్యత్తులో ఏం అవ్వాలనుకుంటున్నారు పిల్లలను అడగగా వారు వైద్య విద్యను అభ్యసించి డాక్టర్ అవ్వాలనుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. అందుకు అనుగుణంగా చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ కుటుంబ సభ్యులకు సూచించారు.

# ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించండి.

**కార్యాలయపు ఫైళ్ళన్నీ ఈ ఆఫీస్ ద్వారానే సమర్పించాలి.-పిజిఆర్ఎస్ కు 220 దరఖాస్తులు.**

**నిర్ణీత కాలపరిమితిలోగా అర్జీలను పరిష్కరించండి. జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 22:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి సంతృప్త స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా సంతృప్త స్థాయిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులు పరిష్కరించడంలో పనితీరును మెరుగుపరుచుకుని జవాబుదారీతనంతో మెరుగైన సేవలను అందించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులకు సరైన రీతిలో ఎండార్స్మెంట్ ఇవ్వకపోవడం వల్లే అసంతృప్తి స్థాయి పెరిగి జిల్లా ర్యాంకింగ్ లో వెనుకబడి పోతున్నామని కలెక్టర్ గుర్తుచేస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల ఆడిట్ నిర్వహణ ప్రగతి కూడా సంతృప్తికరంగా లేదని రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా అధికారులు





ప్రత్యేక శ్రద్ధ పెట్టి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న రీఓపెన్ దరఖాస్తులన్నీ ఈ వారం క్లియర్ చేయాలని సూచించారు. రెవిన్యూ దరఖాస్తులపై ఆర్డీఓలు, తాసిల్దార్ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయపు ఫైళ్ళన్నీ సంబంధిత అధికారుల ఈ సైన్ తో ఈ ఆఫీస్ ద్వారానే సమర్పించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా ర్యాంకింగ్ కూడా ఈ ఆఫీస్ ఫైళ్ళు, సంతృప్త స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారంపై ఆధారపడి ఉంటుందని కలెక్టర్ సూచించారు.
పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు.
1) కోవెలకుంట్ల మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి కుందూ నది వెళ్లే ప్రాంతంలో ఉండే మా పొలాలు సోమశిల ప్రాజెక్టు నీళ్లు రావడంవల్ల ఖరీఫ్ పంట వేసుకోవడానికి వీలు లేకుండా పోయిందని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
2)రుద్రవరం మండలం, పెద్దకంబలూరు గ్రామానికి చెందిన ఎన్. శ్రీనివాసులు తనకు సర్వేనెంబర్ 858.లో 6.8 ఎకరాల భూమి ఆన్లైన్ చేయించాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
3) బేతంచెర్ల మండల కేంద్రానికి చెందిన వి. సరస్వతి తనకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మంజూరు చేయించాలని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
4) పగిడ్యాల మండలం, రాములపాడు గ్రామానికి చెందిన కే.సుంకమ్మ సర్వేనెంబర్ 276/1 లో 1.66 ఎకరాల నా భూమిని ఇతరులు ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి ఆక్రమించారని ఈ భూమిపై విచారణ చేసి నాకు న్యాయం చేయాలని కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
ఇంకా ఈ కార్యక్రమంలో 220 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 22:**
స్వర్ణాంధ్ర -2047 లో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.
సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ పై వివిధ శాఖల అధికారులు, యంగ్ ప్రొఫెషన్స్ జి ఎస్ డబ్ల్యూ ఎస్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... నంద్యాల జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని జిల్లాను అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు యంగ్ ప్రొఫెషనర్స్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ముఖ్యంగా అగ్రికల్చర్, హార్టికల్చర్, టూరిజం తదితర రంగాలలో ఉన్న వనరుల సద్వినియోగం చేసుకొని జిడిపి పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇండస్ట్రీస్ సెక్టార్






లో మన జిల్లా మొదటి స్థానంలో నిలవాలంటే నియోజకవర్గంలోని ప్రతి మండలంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఆ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ఫ్యాన్ తయారు చేయాలన్నారు.
స్వర్ణాంధ్ర 2047లో భాగంగా నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్, జిల్లా విజన్ ప్లాన్ యూనిట్ ఏర్పాటు చేయడం జరిగింది.
జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో 7 విజన్ ప్లాన్ యూనిట్లు ఉంటాయన్నారు. ఇందులో నియోజకవర్గానికి ఒక నోడల్ ఆఫీసర్, ఒక యంగ్ ప్రొఫెషనర్ ఐదు మంది గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఉంటారన్నారు.
వీరందరూ సమన్వయంతో పనిచేసి భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారు చేసి జిల్లాను అని రంగాలలో మొదటి స్థానంలో నిలిపేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా విజన్ ప్లాన్ యూనిట్ నోడల్ ఆఫీసర్లు నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిపిఓ, డిఆర్ డి ఏపిడి, యంగ్ ప్రొఫెషన్స్, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ కె. తిక్కన్నకు విప్లవ జోహార్లు.

**పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
విప్లవోద్యమ కార్మిక నేత, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.తిక్కన్న మూడవ వర్ధంతి సభను ,సోమవారం నాడు స్థానిక నంద్యాల పట్టణంలోని జార్జిరెడ్డి కార్యాలయం నందు విప్లవశ్రేణులు మధ్య ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి విప్లవ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు .కామ్రేడ్ తిక్కన్న మూడవ వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ కామ్రేడ్ తిక్కన్న జీవితం విప్లవోద్యమానికే అంకితమయ్యాడని ,తన చివరి శ్వాస వరకు విప్లవ పార్టీలో కొనసాగాడని అన్నారు .తన చిన్నతనం నుండే ఆదోనితో పాటు జిల్లాలోని అశేష కార్మిక వర్గాన్ని కూడగట్టుకొని కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో క్రియాశీలక



పాత్ర పోషించారని అన్నారు.కామ్రేడ్ తిక్కన్న 2022 సెప్టెంబర్ 22వ తేదీన అర్ధరాత్రి అనారోగ్యంతో ఆదోనిలో మరణించారని తెలిపారు. ఆయన మరణం ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విప్లవ పోరాటాలకు తీవ్రమైన నష్టం అని అన్నారు. కే .తిక్కన్న ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేశారని తెలిపారు. ఆయన మరణం పీడత ప్రజా ఉద్యమాలకు తీరని నష్టం అన్నారు .జిల్లాలో ప్రజల కోసం కార్మికుల కోసం రైతాంగ విద్యార్థి ఉద్యమాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.నేడు మోడీ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో 64 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసిందన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు జరగకపోయినా ఆంధ్రకు అన్ని విధాల అన్యాయం జరుగుతున్న వీరికి పట్టింపు లేదని తెలిపారు. మరోపక్క ప్రగతిశీల శక్తులను, మేధావులపై ,రచయితలపై ఉపా, దేశద్రోహం లాంటి చట్టాలను అమలు చేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేసే క్రమంలో తిక్కన్న మరణం ప్రజానీకానికి తీవ్రమైన నష్టంగా వారు భావించారు.కార్మిక వర్గ విముక్తి కోసం పోరాడటమే కామ్రేడ్ తిక్కన్న కు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు షాహిద్,బాలాజీ, వినయ్, యుగంధర్,కృష్ణ, రసూల్,మహమ్మద్,ఖాజా మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ ప్రతిపాదనలు సమర్పించండి.

**జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 22:**
జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశ్రామిక ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాలు, రోడ్లు%–%భవనాల నిర్మాణం వంటి పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో అర్జీల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి ప్రతి ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరమవుతుందో సంబంధిత శాఖలు స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూముల వివరాలను సిద్ధం చేయడంలో ఆలస్యం జరిగితే సంబంధిత శాఖలపై బాధ్యత ఉంటుందన్నరు. భూసేకరణకు సంబంధించి పబ్లిక్ హెల్త్ శాఖకు ఆళ్లగడ్డ, నందికొట్కూర్లలో ఎస్టిపిసి ప్రాజెక్టు యుఐడిఎఫ్ స్కీం కింద రెండెకరాలు, గృహ నిర్మాణాలకు పట్టణ ప్రాంతాలలో వంద ఎకరాలు, బనగానపల్లెలో ఎంజెపి స్కూల్, ఆళ్లగడ్డ పట్టణంలో బాలుర వసతి గృహానికి 50 సెంట్లు, బాలికల వసతి గృహానికి 50 సెంట్లు, నంద్యాల పట్టణంలోని బీసీ భవన్‌కు 50 సెంట్లు, డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, శ్రీశైలంలోని ఆరు సంక్షేమ వసతి గృహాలకు ఒక్కొక్కటికి 50 సెంట్లు చొప్పున, ఖజానా శాఖకు ఆర్థిక సమీకృత భవనానికి 50 సెంట్లు, అవుట్డోర్ స్టేడియానికి 15 ఎకరాలు, నియోజకవర్గాలలో పశువుల వసతి గృహాలకు అవసరమైన భూములు, ఆళ్లగడ్డలో వంద పడకల ఆసుపత్రికి రెండు ఎకరాలు, డోన్‌లో వంద పడకల ఆసుపత్రికి మరో రెండు ఎకరాలు, పిన్నాపురం, యు.బల్లవరం, బిల్లేలాపురం, కానాల స్కూళ్లకు ఒక్కో స్కూలుకు 5 ఎకరాలు చొప్పున, రెసిడెన్షియల్ హాస్టళ్లకు అల్లూరులో పది ఎకరాలు అవసరమని సంబంధిత శాఖలు సూచించిన నేపథ్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు భూకేటాయింపు రిక్విజిషన్ అనెక్సర్-11 రూపంలో సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీల ద్వారా ప్రతిపాదనలు రావాలని ఆమె ఆదేశించారు. భూముల ఫీజిబిలిటీని బట్టి ఆర్డీవోలు, తహసీల్దార్లు తనిఖీలు నిర్వహించి 26 డాక్యుమెంట్లతో కూడిన నివేదికను సమర్పిస్తే ప్రతిపాదనలు ల్యాండ్ మేనేజ్మెంట్ అథారిటీకి పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం క్యాబినెట్ ఆమోదం, జీఓ వెలువడిన తరువాత భూములను సంబంధిత శాఖలకు కేటాయిస్తామని వివరించారు. పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ వంటి ప్రాధాన్యత ప్రాజెక్టులకు అడ్వాన్స్ పొజిషన్ ఇస్తామని, జీఓ వెలువడిన తర్వాతే సంబంధిత భూములను స్వాధీనం చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ కేఫ్ ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
నంద్యాల పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ దగ్గర పద్మావతి నగర్ రోడ్డులో నూతనంగా లోకేష్ కుమార్, నాగలక్ష్మి , వేముల వెంకటేశ్వర్లు ఏర్పాటుచేసిన ఫ్రెండ్లీ కేఫ్ ను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు వందల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు తో కలిసి ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అలాగే మరికొందరికి ఉపాధి కల్పించాలని, యువత యొక్క స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధి తోడ్పడుతుందన్నారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం యువత స్వయం ఉపాధికై రుణాల అందిస్తున్న విషయం కూడా గుర్తు చేశారు. అనంతరం ఫ్రెండ్లీ కేఫ్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు టిడిపి ఇంచార్జ్ నూర్ భాషా, సర్దార్, మార్కెట్ డైరెక్టర్ స్వామి నాయక్, అడ్వకేట్ పిడి బాబు, మాజీ కౌన్సిలర్ కృపాకర్, నవాజ్ , కాజా, చాంద్ రెబల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెన్సింగ్ విజేత పబ్బతి చిన్మయి శ్రేయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:** ఆర్యవైశ్య ముద్దుబిడ్డ పబ్బతి చిన్మయ శ్రేయ (ప్రముఖ బిల్డర్ పబ్బతి వేణు గారి కుమార్తె) ఇటీవల ఉత్తరాఖండ్ లో జరిగిన అండర్ 17 ఫెన్సింగ్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో అర్హత సాధించి అక్కడ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాన్ని అందుకున్న సందర్భంగా ఆ అమ్మాయిని ప్రోత్సహిస్తూ నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మరియు వాసవిజాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ చార్టర్ గవర్నర్ బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమంలో నంద్యాల తెలుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ చేతులమీదుగా ఘనంగా సన్మానించడమైనది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్ నందు జరిగిన అంతర్జాతీయ అండర్ 17 ఫెన్సింగ్ క్రీడలో రాయలసీమలోనే మొదటిసారిగా సత్తా చాటిన పబ్బతి చిన్మయి శ్రేయ మన నంద్యాల వాసి కావడం చాలా గర్వకారణం అని వీరు ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని నంద్యాల ప్రతిష్టను మరియు వారి తల్లిదండ్రుల కీర్తిని నలువైపులా చాటి చెప్పే విధంగా ఆడాలన్నారు . అనంతరం పబ్బతి చిన్మయి శ్రేయ శాలువాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు కండె శ్యాంసుందర్ లాల్, భవనాశి మహేష్, నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ నవనంది అధ్యక్షుడు కూరాకు శ్రీనివాస దత్తాత్రేయ,కోశాధికారి తేజ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ విజయ శేఖర్,ఉపాధ్యక్షులు జనార్ధన్, పోలా అనిల్ ,చంద్రశేఖర్,కార్యదర్శులు శివశంకర్, సుబ్బారావు,రవిప్రకాష్, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ మల్లిపెద్ది నాగరాజు, సభ్యులు మోహన్,మనోజ్,మురళి,సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# సుంకులమ్మ దేవాలయంలో దసరా శరన్నవరాత్రుల పూజలు.

**సుంకులమ్మ వీధిలో , ప్రత్యేక అలంకారం లో సుంకులా పరమేశ్వరి అమ్మవారు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
దసరా శరన్నవరాత్రుల సందర్భంగా సుంకులమ్మ వీధిలో ఉన్న పురాతన సుంకులమ్మ దేవాలయంలో అమ్మవారికి విశేషాలంకారాలతో ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ గుర్రాల రవికృష్ణ, గౌరవ అధ్యక్షులు గోపిశెట్టి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు న్యాయవాది గోపిశెట్టి ప్రసాద్,కార్యదర్శి చిమ్మా నాగన్న,గౌరవ సలహాదారు ఎంచెర్ల నరసింహారావు, కోశాధికారి పొన్నపాటి జగన్నాథం,బైగ్గారి ప్రసాద్,బైగ్గారి వెంకట మురళి కృష్ణ తెలియజేశారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూదసరా పర్వదినాలలో భక్తులు గ్రామ దేవత గా 100 సంవత్సరాలకు పూర్వం వెలసిన సుంకుల పరమేశ్వరి అమ్మవారిని దర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రతిరోజు అమ్మవారిని,గుడి ప్రాంగణంలో ఉన్న శివాలయం, సీతా రాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.


దసరా శరన్నవరాత్రుల మొదటి రోజు సుంకులమ్మ వీధి దేవాలయంలో విశేష అలంకారంలో శ్రీ సుంకుల పరమేశ్వరి అమ్మవారు.

# నంద్యాల వార్డు సెక్రెటరీస్ అసోసియేషన్ ఎన్నిక.

**అధ్యక్షుడుగా కె.మధుసూదన్ రెడ్డి,ప్రధానకార్యదర్శిగా యం. సంపత్ కుమార్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
నంద్యాల మునిసిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న వార్డు సెక్రెటరీల అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం మునిసిపల్ టౌన్ హల్ నందు వార్డు సెక్రెటరీల సమస్యల పరిష్కారం కోరకు సమావేశం నిర్వహించారు.సమావేశం అనంతరం నంద్యాల వార్డు సెక్రెటరీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడుగా కె. మధుసూదన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా యం. సంపత్ కుమార్, కోశాధికారిగా కె.పద్మావతి,ఆర్గనైజింగ్ సెక్రటరీగా, జి నరేంద్ర,వర్కింగ్ ప్రెసిడెంట్ గా వి.ఉమామహేశ్వరి,ఉపాధ్యక్షులుగా ఎస్. సి.వి.రమణ రావు, ఎస్ కరీం బాషా,పి.జైనుల్లాబుద్దిన్,ఎస్. నబీ రసూల్, బి.ప్రభావతి కార్యదర్శులుగా కె వెంకట సుధాకర్, ఎం.రాంబాబు,పి.సురేష్ రెడ్డి,కె.రాజు నాయక్,ఎ.లక్ష్మీదేవి, మహిళా విభాగం కన్వీనర్ వై. శ్రీలక్ష్మి, కో కన్వీనర్ గా విజయలక్ష్మి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కో-ఆర్డినేటర్ గా డి.వి రామకృష్ణ,సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గా జి. నవీన్ కుమార్,న్యాయ సలహాదారులుగా ఆర్. రాఘవేంద్రయ్య,జి చంద్రశేఖర్ వీరితో పాటు మరో 17 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ నంద్యాల మునిసిపాలిటీ పరిధిలో పని చేస్తున్న వార్డు సెక్రటరీలు గత ఆరు సంవత్సరాల నుండి అనేక రకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నారని, సమావేశంలో చర్చించిన సమస్యలన్నింటిని మునిసిపల్ కమిషనర్ మరియు జిల్లా అధికారుల దృష్టికి తీసుకోని వెళ్తామని,అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యగుల సమస్యల పరిష్కారం కోరకు జరుగుతున్న కార్యక్రమాలలో ముందుంటామని తెలియజేసారు.



కె.మధుసూదన్ రెడ్డి,


ఎం.సంపత్ కుమార్

# రుద్రవరంలో ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం.

**పార్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు.**

**ఆంధ్ర ప్రగతి రుద్రవరం సెప్టెంబర్ 22:**
మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు దసరా నవరాత్రి ఉత్సవాలు మొదటిరోజు అత్యంత వైభవంగా మరియు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో మొదటి రోజున అమ్మవారు భక్తులకు శ్రీ పార్వతి దేవి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు.ఉదయం వేళ, ప్రధాన అర్చకులు రామడుగు కాశి విశ్వనాథ శర్మ, శేష ఫణి శర్మ, మరియు వారణాసి గోపి శర్మల ఆధ్వర్యంలో కలశ స్థాపన, రుత్వికరణ, మరియు దీక్షారంభం వంటి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి మూల మంత్ర జపము, లలితా సహస్రనామం కుంకుమార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, మరియు నవగ్రహ జపాలు నిర్వహించబడ్డాయి. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించి మంగళహారతి ఇచ్చారు.ఈ తొలిరోజు పూజా కార్యక్రమాలను గుండా రామగురప్ప, వేణుగోపాల్, క్రిష్ణ కిషోర్, మరియు సురేష్లు పూజా దాతలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ చోలవేటి సూర్యనారాయణ, కోశాధికారి పెరుమాళ్ళ నరసింహయ్య, కార్యదర్శి పాలూరు సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు, మరియు రుద్రవరం పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



# రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైన నంద్యాల క్రీడాకారుడు.

**ఎయిర్ పిస్టల్ విభాగంలో కర్నూలు జిల్లా జట్టుకు ఎంపికైన సుమిత్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
19 సంవత్సరాల లోపు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు ఎంపిక పోటీలు గతవారం కర్నూలు నగరంలో ఆర్కే రైఫిల్ షూటింగ్ అకాడమీలో ఎస్.జి.ఎఫ్.ఐ.సెక్రెటరీ రాఘవేంద్రరావు నిర్వహణలో, రవికుమార్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా జరిగిన ఈ ఎంపిక పోటీలలో నంద్యాల నారాయణ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న డి. సుమిత్ ఎయిర్ పిస్టల్ విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ సుమిత్ కు జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరఫున పాల్గొనడానికి కృషి చేయాలని సుమిత్ ను కోరారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, సీనియర్ సభ్యులు ఎం.పీ.వి. రమణయ్య, లాలి స్వామి, రామయ్య, కరాటే మాస్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ తగ్గింపుతో.. ప్రతి ఇంటికీ మేలు జరుగుతుంది..!

**ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయానికి నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు హర్షం.**











**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 తగ్గింపు నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికి ఉపశమనం కలిగిస్తుందని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు.మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భాజపా ఆధ్వర్యంలో జరుగుతున్న సేవ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం వివేకానంద ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో అభిరుచి మధు మాట్లాడారు. పాలు, పనీర్, రొటీ, పిజ్జా బ్రెడ్, పుస్తకాలు, పెన్సిల్స్, మందులు, ట్రాక్టర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు వరకు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా జీఎస్టీని తగ్గించడం ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టికి నిదర్శనమని ఆయన అన్నారు. “సామాన్యుడి నుండి రైతు వరకు అందరూ లాభపడేలా మోదీ గారి నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది” అని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ప్రముఖ ఆడిటర్లు, వైద్యులు, లెక్చరర్లు, మేధావులు పాల్గొన్నారు. వ్యాపారవేత్తలు కూడా జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు.

### జీఎస్టీ 2.0 ముఖ్యాంశాలు

రోజువారీ ఆహార పదార్థాలపై జీఎస్టీ 0%,డ్రై ఫ్రూట్స్, బిస్కెట్లు, కాఫీపై జీఎస్టీ 5%,
మందులు, వైద్య పరికరాలపై 0%-5%,
%ట్రాక్టర్లు, సైకిళ్లు, వ్యవసాయ యంత్రాలు 5%-18%,
%టీవీలు, ఏసీలు, ఫ్రిజ్, వాహనాలు 18%,
నోటుబుక్స్, పాఠశాల పుస్తకాలు, స్టేషనరీపై 0%,
సమావేశంలో కాసెట్టి చంద్ర, ఉపేంద్ర రెడ్డి, లక్ష్మీరెడ్డి, రమేష్ బాబు, ఇంటి ఆది నారాయణ, నిమ్మకాయల సుధాకర్, పసుపుల రవి, అడ్డగాళ్ల మల్లికార్జున, నిచ్చెనమెట్ల సుబ్బరామయ్య, గెలివి రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత ఆధునిక యుగంలో గుండె జబ్బుల పై ప్రజలకు అవగాహన అవసరం.

**-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి డోన్ సెప్టెంబర్ 22:** ఆధునిక కాలంలో గుండె జబ్బుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన తర్వాత వచ్చే గుండె జబ్బులు ఇప్పుడు చిన్న వయసులోనే వస్తున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మానసిక ఒత్తిడి గుండెజబ్బులకు కారణమవుతున్నాయని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. గుండెపోటు వచ్చిన వ్యక్తుల్లో గుండె రక్తప్రసరణ సాధారణ స్థాయి కంటే తక్కువుంటుంది. అందువల్ల ఆ వ్యక్తి నడిచినా, మెట్లెక్కినా ఆయాసం, గుండెలో నొప్పి, గుండె పట్టేసినట్లు ఉండడం, ఒక్కోసారి భోజనం చేసిన తర్వాత కూడా ఇలా జరగొచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.గుండె జబ్బుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తూనే ఉంటాం. నిజానికి గుండె జబ్బులు రాకుండా చూసుకోవడం మన చేతుల్లోనే ఉందని అంటున్నారు వైద్యులు. ఉదయాన్నే వాకింగ్ వెళ్లాలంటే చాలా బద్దకం. నిజానికి నడక గుండెకు మంచిది. అందుకే రోజూ అరగంట పాటు నడవడం అలవాటు చేసుకోండి.డైనింగ్ టేబుల్ పై ఉప్పు డబ్బా లేకుండా చూసుకోండి. తినే సమయంలో అదనంగా ఉప్పు వేసుకునే అలవాటుకు స్వస్తి చెప్పండి.రోజు తాజా పండ్లు తినండి. ఆల్కహాల్ తీసుకోవడం మానుకోవాలి. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే మెట్లు ఎక్కండి. మీరు పైకి ఎక్కితే మీ రక్తపోటు తగ్గుతుంది. పొగతాగే అలవాటు ఉంటే ఈ రోజే మానేయండి. రక్తనాళాలలో బ్లాక్స్ ఏర్పడే అవకాశాలను స్మోకింగ్ మరింత పెంచుతుంది. కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. అలాగే లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ షుగర్, బి.పి పరీక్షలను తరచుగా చెక్ చేయించుకోండి. బరువును నియంత్రణలో ఉంచుకోండి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోండి. ఏడాదికొకసారి కంప్లీట్ హెల్త్ చెకప్ చేయించుకోండి. డయాబెటిస్ ,బిపి ఉన్న వారు క్రమం తప్పకుండా వైద్యనిపుణులచే వైద్య చికిత్స చేయించుకొని క్రమం తప్పకుండా మందులు వాడుతూ బిపి, షుగర్లను నియంత్రణలో ఉంచుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండగల్గుతారు. దినచర్యలో యోగ,వ్యాయామం , ధ్యానం చేయడం మరవకండి. షుగర్ ఉన్న వారికి(ముఖ్యంగా మహిళలు) గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ అని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు. కావున ఈ జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బులు దరిచేరకుండా ఉంటాయని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.


పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.


# నంద్యాల లోని పోలీస్ స్టేషన్ ల ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.












**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 22:**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ నంద్యాల పట్టణంలోని డి.ఎస్.పి కార్యాలయం మరియు తాలూకా పోలీస్ స్టేషన్ ను, సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్,నంద్యాల పోలీస్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాలనుఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాలూకా పోలీస్ స్టేషన్ వద్దకు రాగానే ముందుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని పోలీసుల పనితీరుపై ఆరా తీశారు.
అనంతరం స్టేషన్ పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరియు పలు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని ఆదేశించారు.
అనంతరం పోలీస్ క్వార్టర్స్ వద్ద గల పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ ను సందర్శించి ఇక్కడ ఉన్న మందుల వివరాలు డాక్టర్ల పనితీరు మొదలగు వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.
నంద్యాల పట్టణంలోని డి.ఎస్.పి కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించి నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేయడం జరిగింది.
అనంతరం మహిళా పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది వివరాలు వారు చేయుచున్న విధుల గురించి ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ మరియు, సైబర్ క్రైమ్, మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
నంద్యాల పట్టణంలోని సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి సిబ్బంది వివరాలు, లాకప్ గదులు, పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన నేరస్తుల ఫోటోల వివరాలు,సిబ్బంది నిర్వహించుచున్న విధులు మొదలగువాటి గురించి అడిగి తెలుసుకుని సీసీ ఎస్ ఇన్స్పెక్టర్ తో మాట్లాడుతూ మీకు అప్పగించిన కేసుల దర్యాప్తులో మరియు నేరస్తులను కనుగొనేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని పలు సూచనలు చేయడం జరిగింది.
నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసి పలు కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం స్టేషన్ పరిధి, స్టేషన్ పరిధిలోని ప్రజల నిష్పత్తి, నేరాలు అదుపు చేయడంలో తీసుకుంటున్న చర్యలు,స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు నేర చరిత్ర కలిగిన వ్యక్తులు మొదలగు వాటిపై ఆరా తీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్డేట్ లో ఉంచుకోవాలని ఆదేశించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి ఆల్ఫోన్స్ , ట్రైనింగ్ డిఎస్పి రాజసింహారెడ్డి గారు పాల్గొన్నారు.

# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 95 ఫిర్యాదులు.

**విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందిస్తాం.**

**ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.**

**పోలీస్ అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 22:** నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఫిర్యాదిదారుల నుంచి 95 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాలని,ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు.

1).మా అమ్మమ్మ మా అమ్మ నాగమణికి ఇంటిపై సర్వహక్కులతో అనుభవించుకునేలా వ్రాసి ఇచ్చిన ఇల్లును దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని మధుసూదన్ మాపై భౌతికంగా హింసిస్తూ బెదిరిస్తున్నాడని మాకు న్యాయం చేయండని ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన పి.శివరాజు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

2).మా అమ్మమ్మ మా అమ్మ నాగమణికి ఇంటిపై సర్వహక్కులతో అనుభవించుకునేలా వ్రాసి ఇచ్చిన ఇల్లును దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని మధుసూదన్ మాపై భౌతికంగా హింసిస్తూ బెదిరిస్తున్నాడని మాకు న్యాయం చేయండని ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన పి.శివరాజు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

3). నంద్యాల పట్టణంలోని గూడ్స్ షెడ్ ఏరియాలో హుస్సేన్ భాషా కు చెందిన ఇంటిలో 5,00,000/-ఇచ్చి వడ్డీ లేకుండా అద్దె లేకుండా ఉండే విధంగా అగ్రిమెంట్ వ్రాయించుకున్నాము. కానీ నేను ఇచ్చిన ఐదు లక్షలు ఎగ్గొట్టాలని దురుద్దేశంతో హుస్సేన్ భాష అతని సడ్డకుడు అయిన బాబు నన్ను బలవంతంగా ఇంటి నుంచి గెంటేసినారని నా సామాన్లు బయట పారవేసినారని నాకు న్యాయం చేయండని హబీబ్ ఖాన్ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

4).మాకు అంగన్వాడి సెంటర్ నందు టీచర్ గా, హౌసింగ్ ఆఫీస్ నందు వర్కింగ్ ఇన్స్పెక్టర్ గా, డేటా ఎంట్రీ ఆపరేటర్ గా, ఇలా వివిధ రకాలుగా ఉద్యోగం ఇప్పిస్తానని వాహిదా అనే వ్యక్తి మమ్మల్ని మోసం చేసిందని డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన సమీరా మరికొందరు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# కనీస వేతనాలకై దశల వారి గా ఆందోళనలు..!

**ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి.**

**జనాభా ప్రాతిపాదికన ఆశా నియామకాలు జరగాలి.**

**ఆశాల నియామకాల్లో రాజకీయ జోక్యం తగ్గించాలి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 22:** ఆశా వర్కర్లకు చట్టభద్ధమైన సౌకర్యాలు కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారని, కనీస వేతనాలు చెల్లించడం లేదని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్( సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల ఎన్ జి ఓ కాలనీ లోని నేషనల్ పీజీ కళాశాలలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా 2వ మహాసభ కు జిల్లా అధ్యక్షురాలు నాగమణి,జిల్లా ఉపాధ్యక్షులు శివమ్మ, క్షమిమ్ మాదవి,చెన్నమ్మ కృపావతి, సుమలత

అధ్యక్ష వర్గం గా వ్యవహారించారు. ఈ మహాసభలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ( సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి ముఖ్యతిధిగా హాజరు కాగా,

సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. ఏసు రత్నం, ఏ. నాగరాజు,ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఏర్పడి 20 ఏళ్లు అవుతున్న వారిని కార్మికులు గా గుర్తించడం లేదని, కనీస వేతనాలు చెల్లించలేదన్నారు.కేంద్ర ప్రభుత్వం 3500 పారితోషకం ఇస్తూ వాటితోనే ఆశాలు బ్రతకాలని చెప్పడం బాధాకరమన్నారు. ఒక్క వైపు ధరలు పెరిగిపోతున్నాయని, ఆశా వర్కర్లతో పలు రకాల పనులను చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లతో చేయిస్తున్న పనికి ప్రభుత్వం ఇస్తున్న వేతనాలకు పొంతన లేకుండా ఉందన్నారు. ఆశా వర్కర్ల కనీస వేతనాల పెంపునకు టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిపెస్టో లో పెట్టారని ఆ హామీని అమలు చేయాలన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆశా వర్కర్ల నియామకాలను చేపట్టాలని%బ% డిమాండ్ చేశారు. 1200 మందికి ఒక్క ఆశా వర్కర్ ఉండాల్సి ఉండగా%వవ% 1500,2 వేలు, 3 వేలు జనాభా కు ఒక్క ఆశ వర్కర్ పని చేయాల్సి వస్తుందన్నారు. ఎన్ హెచ్ ఎం నిబంధనలు ప్రకారం అదనంగా ఆశా వర్కర్లను నియమించి, వారి పై పని ఒత్తిడి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఆశా వర్కర్లతో టీబీ గళ్ల పరీక్షలు చేయించడం, వాక్సిన్ బాక్స్ లు ఆశలతో మొయించడం, వెల్ నెస్ సెంటర్ లు తెరిపించడం, క్లిన్ చేయించడం, ఎన్ సి డి సర్వేలు చేయించడం వంటి పనులు చేయిస్తూ 24 గంటలు విధుల్లో ఉన్న ఆశాలను ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ఉండాలని చెప్పడం సరైంది కాదన్నారు.ఏ ఎన్ ఎం ట్రైనింగ్ అయిన ఆశా వర్కర్ల కు రెగ్యులర్ ఉద్యోగ నియామకాల్లో వేయిటేజి ఇవ్వాలన్నారు.ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం నిలువరించాలని, నేరుగా ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలన్నారు.రాబోయో కాలంలో ఆశా వర్కర్ల వేతనాల కోసం, చట్ట బద్ద మైన సౌకర్యల కోసం, ఉద్యోగ భద్రత కోసం ఆశా వర్కర్లు ఉద్యమాలకు సిద్ధం కావాలని ధనలక్ష్మి పిలుపునిచ్చారు.ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు యేసు రత్నం మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఓట్ల కోసం మహిళలు గుర్తుకు వస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాలను ప్రయివేట్ పరం చేస్తున్నారు. మహిళలకు పనిచేసే చోట రక్షణ ఉండటం లేదు. హక్కుల కోసం పోరాడితే నిర్బందాలు విదిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సంక్షేమం కోసం ఉన్నామని చెప్పుకుంటున్నారని సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఆశాలు సంఘటతంగా ఉండాలని, హక్కులకై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజుమాట్లాడుతూ అభివృద్ధి గురించి



మాట్లాడే పాలకులు ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల బతుకులు దుర్భరంగా మారుతున్నాయాన్నారు. ధరలు పెరిగిపోతున్న వీరి వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని చట్టాలు ఉన్నా పాలకులు మాత్రం వాటిని విస్మరించి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్మికులు, పేద మధ్య తరగతి ప్రజానీకం వైపు కేంద్ర ప్రభుత్వం లేదన్నారు. కార్పొరేట్, బడా పెట్టుబడి దారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని విమర్శలు గుప్పించారు. రోజు రోజుకు స్కీమ్ వర్కర్స్ పై ప్రభుత్వాల వేధింపులు పెరిగిపోయాని అన్నారు.ఆనాడు బ్రిటిషోడికి వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకుంటే నేటి మన పాలకులు ఉద్యోగులను, కార్మికులను వెట్టి చాకిరీ లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నదని బీజేపీ ప్రభుత్వం దానికి వత్తాసు పలుకుతున్న,కూటమి ప్రభుత్వం చర్యలను ఖండించారు. పాత లేబర్ కోడ్ లను మార్చుతూ కొత్త లేబర్ కోడ్ లను తెచ్చి కనీస వేతన చట్టం, పని భద్రత తదితర కోడ్ లను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.అంతకు ముందు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమారి కార్యదర్శి జిల్లాలో గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు జరిగిన ఆశా కార్యక లాపాల నివేదికను ప్రవేశపెట్టారు.

# ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి

## : సిఐటియు డిమాండ్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:** అమెరికాలోని చికాగో నగరంలో లక్షలాది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పది విధానాన్ని ప్రపంచమంతా అమలు చేస్తుంటే మన దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మికుల శ్రమను దోచుకునేందుకు 10 నుండి 13 గంటల పాటు పనిచేయాలని నిబంధన పెట్టడం సరైనది కాదని,మన రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరొక అడుగు ముందుకెళ్లి కేబినెట్లో నిర్ణయం చేయడం చాలా దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే ధనలక్ష్మి అన్నారు.అనంతరం సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోడీ ప్రభుత్వానికి సాగిలపడి అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రాలే అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో 13 గంటల పాటు పనిచేయాలని అటువంటి నిర్ణయాన్ని కేపినట్లు తీసుకురావడం చాలా దుర్మార్గమని మహిళలకు రక్షణ దేశంలోనే కరువైంది అటువంటి తరుణంలో మహిళలు కూడా రాత్రి వేళల్లో పనిచేయవచ్చు అనే నిబంధన తీసుకురావడం చాలా దుర్మార్గమని కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయకుండా చాకిరి చేయించుకోవడంలో పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలను చేయడం కార్మికులకు కనీస వేతనాల గురించి మాట్లాడకపోవడం చాలా దుర్మార్గమని దట్ ఇస్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను అమలు చేయకుండా నాలుగు లేబర్ కోర్టులుగా ఫిటింగ్ చేసి కార్మికులను మాయా బానిసలుగా చేసే విధానాలను అమలు చేయడం దుర్మార్గమని దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలను అమలు చేయాలని నాలుగు లేబర్ కోర్లను రద్దు చేయాలని కోట్లాదిమంది కార్మికులు సమ్మెలో పాల్గొన్న ప్రభుత్వంలో చలనం లేదని ఇప్పటికైనా ఇటువంటి విధానాలను మానుకోకపోతే కార్మికులంతా ఏకమై బిజెపి ప్రభుత్వానికి,రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వానికి సింగల్ డిజిట్ కే పరిమితం అవ్వక తప్పదని హెచ్చరించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పట్టణ కార్యదర్శి రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చేముందు కార్మికులకు కనీస వేతనాల ను ఇచ్చేందుకు కృషి చేస్తామని ప్రతి ఒక్క కార్మికుడి జీవితంలో వెలుగులు నింపే ఎలా ప్రభుత్వ పాలన అందిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు మోడీ ప్రభుత్వానికి సాగిలపడి 64 కార్మిక చట్టాలను అమలు చేయకుండా నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాటం చేయకుండా ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయకుండా ఎనిమిది నుంచి 13 గంటల పాటు పని చేయాలని నిబంధనలను తీసుకురావడం చాలా దుర్మార్గమని ముఖ్యంగా మహిళలకు రక్షణ కరువైన తరుణంలో ఈ విధమైనటువంటి నిర్ణయం సరైంది కాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే గతంలో జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా పాలన అందించి 11 సీట్లకే పరిమితమైనదో రాబోయే కాలంలో చంద్రబాబు నాయుడు కు 10 సీట్లు కూడా రాకుండా సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యేలా కార్మిక వర్గాన్ని పోరాటాల్లోకి తీసుకువస్తామని అన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహించాలి.

**- నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.**

**పబ్బతి చిన్మయశ్రేయ విజయంపై హర్షం, అంతర్జాతీయ స్థాయికి ఎంపిక గర్వకారణం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22**: క్రీడల ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, క్రీడాకారులు ప్రతిభ చాటితే రాష్ట్రానికీ, దేశానికీ కీర్తి వస్తుందని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మదు అన్నారు. ప్రతిభ కలిగిన ప్రతి క్రీడాకారుడికి అన్ని విధాల సహాయం అందించడమే కాకుండా వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆయన పేర్కొన్నారు.ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానిలో జరిగిన అండర్-17 జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరచి పబ్బతి చిన్మయశ్రేయ భారత జట్టుకు ఎంపిక కావడం పట్ల ఆదివారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా, పబ్బతి చిన్మయశ్రేయ ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.గత నెల 29, 30 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించిన పబ్బతి చిన్మయశ్రేయ, అక్కడ మరోసారి ప్రతిభ చాటుతూ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం నంద్యాల జిల్లాకు గర్వకారణమని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో హల్ద్వానిలో జరగనున్న ఆసియా ఫెన్సింగ్ పోటీల్లో పబ్బతి చిన్మయశ్రేయ భారత జట్టును ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో కఠినంగా సాధన చేస్తున్న పబ్బతి చిన్మయశ్రేయ భవిష్యత్తులో భారత్‌కు పతకాలు సాధించి దేశాన్ని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టాలని అభిరుచి మదు ఆకాంక్షించారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న యువతకు అవసరమైన సదుపాయాలు, శిక్షణ, మద్దతు కల్పించే దిశగా ప్రభుత్వం , సమాజం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిరుచి మధు, కాసెట్టి చంద్ర, ఉపేంద్రరెడ్డి,లక్ష్మిరెడ్డి, రమేష్ బాబు, మల్లేశ్వరెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# సిరివెళ్ల పేరూరు రస్తాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై వివాదం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**సిరివెళ్ల మండలంలోని పేరూరు రస్తాల్లో ప్రభుత్వానికి చెందిన రెవిన్యూ భూమిని ఎలాంటి ప్రభుత్వ అధికారి అనుమతి లేకుండానే కొంతమంది ఆక్రమించి పశువుల కొట్టము (షెడ్) నిర్మించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ భూమిని ఇలా ఆక్రమించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.ఇకపై మరింత వివాదాస్పదంగా మారిందేమిటంటే, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ) అనుమతి లేకుండానే కాకుండా ఆయన సొంతంగా ముందడుగు వేసి అక్కడి షెడ్డుకు ప్రత్యేక కరెంటు కనెక్షన్ ఇచ్చుకోవడం జరిగింద దీంతో భూమి ఆక్రమణ మాత్రమే కాకుండా ప్రభుత్వ వనరులను కూడా వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఈ షెడ్డుకు ఇచ్చిన కరెంటు కనెక్షన్ కారణంగా కింద వైర్లు వేలాడుతూ ఉండటం వలన పశువులు, గొర్రెలు, రైతులు ఎప్పటికప్పుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు రైతులు తమ పశువులు కరెంటు షాక్‌కు గురవుతాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ ప్రజలు, రైతులు కలిసి రెవిన్యూ డిపార్ట్మెంట్, విద్యుత్ డిపార్ట్మెంట్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వెంటనే పశువుల కొట్టము తొలగించాలని, అనధికారికంగా ఇచ్చిన కరెంటు కనెక్షన్ నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు."ప్రభుత్వ భూమి ఆక్రమణకు తావు ఇవ్వకూడదు. రెవిన్యూ శాఖ, విద్యుత్ శాఖ కలిసి చర్యలు తీసుకుని రైతుల పశువులను రక్షించాలి" అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కంబగిరి స్వామి ఆలయ అభివృద్ధి పనులపై మంత్రి బీసీ ని కలిసిన కంబగిరి స్వామి ఈవో, సిబ్బంది..!



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె సెప్టెంబర్ 21:** రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన కంబగిరి స్వామి ఆలయ ఈవో యం.రామకృష్ణ మరియు సిబ్బంది సుబ్బారెడ్డి. అవుకు సమీపంలో గల కంబగిరి స్వామిలో ప్రతి శుక్ర, శనివారం రోజులలో వచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ ద్వారా 20 వసతి గృహములు, కళ్యాణ మండపం నిర్మాణము చేపట్టుట ఇతర అభివృద్ధి పనులపై చర్చించినట్లు ఈ సందర్భంగా ఆలయ ఈవో యం.రామకృష్ణ తెలిపారు.

# బోయలకుంట్ల గ్రామంలో వైభవంగా నవరాత్రుల ఉత్సవాలు.




**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 22:** బోయలకుంట్ల గ్రామం దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బోయలకుంట్ల గ్రామంలో ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహం వద్ద ఈరోజు తొలి అవతారమైన కాధ్యాయిని దేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గౌరవ సిరివెళ్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి దంపతులు ప్రత్యేకంగా పాల్గొన్నారు. వారి నివాసం నుండి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి మరియు నైవేద్యాలు సమర్పించగా, అర్చకుల వేద మంత్రార్చనల మధ్య ఘనంగా పూజలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి దంపతులు గ్రామ ప్రజలు సుభిక్షంగా, పాడిపంటలతో వర్ధిల్లాలని కాధ్యాయిని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

అనంతరం అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను శ్రీకాంత్ రెడ్డి దంపతులిరువురికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

# ఆదివారం అమావాస్య రోజున కొత్తూరు సుబ్బరాయునికి ప్రత్యేక పూజలు..!

### -ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.



**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు. సెప్టెంబర్ 21:**
పాణ్యం మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ, కంపమల్ల నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం మధ్యాహ్నకాల మహా నివేదన సమయంలో స్వామివారికి సర్ప సూక్తంతో సుగంధ ద్రవ్యాలతో, అష్టోత్తర శత క్షీరాభిషేక రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, మహా రుద్రాభిషేకం, మహా నైవేద్యం, మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులందరికి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.


# సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఛత్తీస్‌ఘడ్ సుముఖత

### నీటమునిగే భూమికి పరిహారం చెల్లింపునకు ఉత్తమ్ అంగీకారం

రాయ్‌పూర్ **సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**తెలంగాణ రాష్ట్రంలోని సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కలిశారు. నీట మునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం తెలిపింది. ములుగు జిల్లాలో 6.7 టీఎంసీ సామర్థంతో ఈ సమ్మక్క సాగర్ డ్యామ్ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు వల్ల నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించనుంది. రామప్ప-పాఖాల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు అందుతుంది. వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది. నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు సమ్మక్కసాగర్ పరిష్కారం దక్కుతుంది. 90 కిలోమీటర్ల టన్నెల్ నెట్‌వర్క్‌తో భారీ ఇంజనీరింగ్ డిజైన్ కింద మూడు పంప్‌హౌసులు, క్రాస్ డ్రెయినేజ్ వర్క్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించ నున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో 73 హెక్టార్ల భూభాగం నీట మునిగే అవకాశం ఉంది. పరిహారం, పునరావాసం భరించేందుకు తెలంగాణ సిద్ధం అని ఛత్తీస్‌ఘడ్ సిఎంకు మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఐఐటీ- ఖరగ్‌పూర్ సబ్‌మెర్జెన్స్ స్టడీ ఫైండింగ్స్ అమలు చేస్తామని ఉత్తమ్ తెలిపారు. ఎన్‌ఓసీ జారీకి ముందే అడ్వాన్స్ చెల్లింపులు ఇవ్వడానికి తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు.

--------

# జిఎస్టీ సంస్కరణలు పేదలకు మేలు: పురందేశ్వరి



రాజమహేంద్రవరం **సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి** జీఎస్టీ సంస్కరణలు పేద మధ్య తరగతి ప్రజలకు ఒక వరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక దేవీచౌక్‌లో శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి 92వ దేవీ నవరాత్రి మహోత్సవాల ప్రారంభం సందర్బంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు- చెప్పారు. దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమైన వేళ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలు తీసుకు రావడం ఆనంద దాయకమన్నారు. శరన్నవరాత్రుల సమయంలో జీఎస్టీ తగ్గించి, ప్రజలకు మంచి చేసిన ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయోరారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు- ఆమె తెలిపారు.

# ఇర్ఫాన్ అకాడమీని ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 22:**
నంద్యాల స్థానిక అయ్యప్ప స్వామి టెంపుల్ పక్కన నూతనంగా ఇర్ఫాన్, షేక్ అబ్దుల్లా ఏర్పాటుచేసిన ఇర్ఫాన్ అకాడమీ ని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. ఎంతోమంది యువతి యువకులు ఉద్యోగాల కోసం సరైన కోచింగ్ లేక ఇబ్బంది పడుతుంటారని అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని తక్కువ ఫీజుతో వారిని ఉన్నత స్థానాలకు చేర్చే విధంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నంద్యాల ఎడ్యుకేషన్ హబ్ గా మారిందని దూర ప్రాంత విద్యార్థులు ఇక్కడ ఉండి చదువుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారని దానికి నిదర్శనం మొన్న జరిగిన మెగా డీఎస్సీ ఉదాహరణగా తెలిపారు. అలాగే ఈ ఇర్ఫాన్ అకాడమీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పిడీ బాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ స్వామి నాయక్ , మాజీ కౌన్సిలర్ కృపాకర్, ఎస్టీ సెల్ నంద్యాల అధ్యక్షులు అసావత్ విజయ నాయక్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలం బాబు, సుధాకర్, కాజా తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు కేసు.. సుప్రీంలో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్



/హైదరాబాద్: ఓటుకు నోటు కేసు కేసుపై సుప్రీంకోర్టు సోమవారం విచార జరిపి, తీర్పును రిజర్వు చేసింది. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేస్తూ కొన్ని రోజుల క్రితం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఎఫ్ఐఆర్‌లో, ఛార్జిషీట్ లో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టుకు వెల్లడించారు. కేసు ప్రాథమిక దశలోనే నిందితునిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిందని చెప్పారు. కేసులో కీలక నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై ఎఫ్ఐఆర్ కొట్టి వేయటం మొత్తం దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసి దర్యాప్తు కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కాగా, జెరూసలెం మత్తయ్య తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తరువాతే ఉత్తర్వులు ఇచ్చిందని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసులో సిఎం ఉన్నా నిందితునిపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టి వేయటాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయటం అభినందనీయమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి స్పందిస్తూ అది రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అని పేర్కొన్నారు.

# మహానంది టెంపుల్ నందు ఆక్టోపస్ బృందంచే మాక్ డ్రిల్ నిర్వహణ






**నంద్యాల సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు తీవ్రవాద నిరోధక దళమైన ఆక్టోపస్ కమాండోలు (తీవ్రవాద యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్) వారు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ సూచనలతో నంద్యాల సాయుధ బలగాల అదనపు ఎస్పీ, శ్రీనివాస రావు పర్యవేక్షణలో ఆక్టోపస్ డిఎస్పీలు తిరుపతి రావు, జగ్గు నాయుడు వారి సిబ్బంది మహానంది టెంపుల్ నందు సోమవారం మాక్ డ్రిల్ చేయడమైనది. ఏదైనా టెంపుల్ లేదా ఇతర ముఖ్యమైన బిల్డింగ్ లపై ఉగ్రవాద దాడులు, బాంబు పేలుళ్లు, లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రణాళిక ప్రకారం ఎలా స్పందించాలి, టెంపుల్ అధికారులు, లోకల్ పోలీస్, రెవెన్యూ, పంచాయితీ, ఫైర్ డిపార్ట్మెంట్, మెడికల్ మరియు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వాళ్ళ సమన్వయంతో ఎలా పనిచేయాలి, పౌరులను ఎలా సురక్షితంగా ఉంచాలి అనే అంశాలపై తమ సన్నద్ధతను, సామర్థ్యాన్ని పరీక్షించుకోవడం కోసం ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ ద్వారా అన్నీ డిపార్ట్మెంట్ వారికి శిక్షణ ఇవ్వడం జరిగినది. ముందుగా ఉదయం మహానంది ఈఓ ఆఫీసు నందు నంద్యాల ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస రావు పర్యవేక్షణలో ఆక్టోపస్ డిఎస్పీలు తిరుపతి రావు, జగ్గు నాయుడు గారు ఒక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో శశిధర్ రెడ్డి, సూపరింటెండెంట్, మహానందీశ్వర దేవస్థానం, రామమోహన్ రెడ్డి, ఎస్ఐ మహానంది సిబ్బంది రమాదేవి, తహశీల్దార్, మహానంది, రఘునాద్, ఫైర్ ఆఫీసర్, నంద్యాల, మహబూబ్ దౌల ఎంపిడిఓ, మహానంది డా.భగవాన్ దాస్, మెడికల్ ఆఫీసర్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగినది. టెంపుల్ పైన అనుకోకుండా ఏదైనా టెర్రర్ ఎటాక్ జరిగినప్పుడు ఏ డిపార్ట్మెంట్ వాళ్ళు ఎలా స్పందించాలి, వారు ఏమి పని చెయ్యాలి, మిగతా డిపార్ట్మెంట్ వారిని ఎలా సమన్వయం చేసుకోవాలి అని ఆక్టోపస్ టీం అన్నీ డిపార్ట్మెంట్ వాళ్ళకి విపులంగా వివరించడం జరిగినది. తరువత పైన తెలిపిన అన్నీ డిపార్ట్మెంట్ వారి సమన్వయంతో ఒక ఫేక్ ఫోన్ కాల్ ద్వారా సమాచారం తెలీసుకొని 21.09.2025 వ తేదీ రాత్రి 21:00 గంటల నుంచి అర్ధరాత్రి 01:30 గంటల వరకు మహానంది టెంపుల్ నందు ఆక్టోపస్ జట్టు మాక్ డ్రిల్ చేయడం జరిగినది.

# జీఎస్టీ సంస్కరణలు భవిష్యత్‌లో గేమ్ ఛేంజర్

### మేడిన్ ఇండియా మరింత బలోపేతం

### స్వదేశీ వస్తువులనే వినియోగించాలి

### జిఎస్టీ లాభాలపై కరపత్రాలతో ఇంటింటి ప్రచారం

**అసెంబ్లీలో వెల్లడించిన సిఎం చంద్రబాబు నాయుడు**



అమరావతి, **సెప్టెంబర్ 22 ఆంధ్ర ప్రగతి** జీఎస్టీ సంస్కరణల తో మేడిన్ ఇండియా మరింత బలోపేతం అవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బలమైన, సమతుల్యమైన సమాజ నిర్మాణమే లక్ష్యమని ఉద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలతో ఏపీ ప్రజలకు రూ.8వేల కోట్ల లాభం వస్తుందని తెలిపారు. స్వదేశీ, మేకిన్ ఇండియా ప్రచారం మరింత ఊపందుకోవాలని సూచించారు. సోమవారం జీఎస్టీ సంస్కరణలపై ఏపీ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు .

గృహోపయోగ వస్తువుల వినియోగం బాగా పెరుగుతోందని చెప్పుకొచ్చారు. దేశీయ ఉత్పత్తులు కొనాలని.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశర చేశారు. దసరా నుంచి దీపావళి వరకు జీఎస్టీ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు వారాల్లో జీఎస్టీపై 65 సమావేశాలు ఏపీలో నిర్వహిస్తామని వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలు భవిష్యత్‌లో గేమ్ ఛేంజర్ అని ఉద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయని చెప్పుకొచ్చారు. స్వర్ణాంధ్ర దిశగా ముందుకెళ్లేందుకు జీఎస్టీ సంస్కరణలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. జీఎస్టీపై ఓ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అని ప్రధానమంత్రి నరేంద్ మోదీ చెప్పారు. జీఎస్టీ ఫలితాలు పేదలకు అన్నివర్గాల స్టేక్ హోల్డర్‌లకు చేర్చాలి. దీనికి 30 రోజులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. దీని అమలుకు ఒక కమిటీ-వేశాం. హెచ్ఆర్డీ మంత్రి లోకేష్ , ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, టూరిజం మంత్రి కందుల దుర్గేష్‌లతో ఈ కమిటీ-వేశాం. జీఎస్టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త దశకు నాంది పలుకుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఏపీకి సంబంధించి ప్రగతిశీల విధానాల ద్వారా పేదల, మధ్యతరగతి జీవితాలను మార్చాలి. దీనికి సూపర్ జీఎస్టీ, సూపర్ సిక్స్, పీ4లు ఏపీని స్వర్ణాంధ్ర వైపు నడిపిస్తాయి. ప్రతి ఒక్కరికి, ప్రతి ఇంటికి బెనిఫిట్ వస్తుంది. మన రాష్ట్రానికి రూ.8వేల కోట్ల లబ్ది ఉంటుంది. చిన్న వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుంది. ఎంఎస్ఎంఈలకు ఊపు వస్తుంది. మేక్ ఇన్ ఇండియాకు దోహదం చేస్తుంది. మన బ్రాండ్‌లు అంతర్జాతీయ బ్రాండ్‌లు అవుతాయి. సెల్ఫ్ రిలయంట్ ఎకానమీకి ఇది దోహదం చేస్తుంది. భారతీయ ఉత్పత్తులను కొంటే అది కేవలం ఒక లావాదేవి మాత్రమే కాదు అది మన సమాజ అభివృద్ధికి హమీ'అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.. ఇంటింటికీ జీఎస్టీ కరపత్రాలు తీసుకెళ్లి అగ్రికల్చర్, ఇతర అంశాల్లో ఎలా లబ్ధి కలుగుతుందో వివరిస్తాం. జీఎస్టీ సవరణలతో డిజిటల్ ఇండియా, డిజిటల్ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. చాలా వరకూ 15వేల గ్రామ సచివాలయాల్లో మీటింగ్‌లు పెట్టి అందరిని ఇన్వాల్వ్ చేస్తాం. 10వేల రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాం. అక్టోబర్ 7, 8 తేదీల్లో విద్యాసంస్థల్లో జీఎస్టీ గురించి వివరిస్తాం. అక్టోబర్ 9న విలేజ్ హెల్త్ సెంటర్‌లు, వెల్ నెస్ సెంటర్‌లలో కార్యక్రమం నిర్వహిస్తాం. బిల్డింగ్ వర్కర్‌లు, అక్టోబర్ 11న 850 సెంటర్లలో కార్యక్రమం నిర్వహిస్తాం. అక్టోబర్ 16న ట్రాన్స్‌పోర్టు లాజిస్టిక్స్ , 200 ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తాం. లాస్ట్ వన్ వీక్‌లో షాపింగ్ అండ్ కల్చరల్ ప్రోగ్రాంలు నిర్వహిస్తాం. విలేజ్ సెక్ర-టె-రియట్, రైతు సేవాకేంద్రాల్లో ఎక్కడికక్కడ ఒక్కోక్కరిని ఏర్పాటు-చేసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. మీడియా, హోర్డింగ్స్ , ఇంటర్వ్యూలు ఇవ్వడం, పాడ్ కాస్ట్‌లు ఇంటర్వ్యూలు, సెలబ్రెటీ-లతో మాట్లాడించి అన్ని చేస్తాం. ఎమ్మెల్యేలు ఇచ్చే అంశాలను కూడా మంత్రి వర్గ ఉపసంఘం ఇక్లూడ్ చేస్తుంది. శాండ్ ఆర్ట్ ఇన్ ఏపీ బీచెస్ నిర్వహిస్తాం. ఈ సంవత్సరం బ్రహ్మాండంగా ఆనందంగా పండుగలను ప్రజలు చేసుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.


ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 23 సెప్టెంబర్ 2025

# కీలక ఆటగాళ్లను వదులుకోనున్న ఆర్సీబీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘనంగా ఆరంభించాలని చూస్తోంది. రజత్ పాటిదార్ నాయకత్వంలో జట్టు గత ఎడిషన్లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్‌లో ఓడించి తొలి ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను గెలుచుకుంది. ఇదే ఉత్సాహం వచ్చే సీజన్ స్టార్ట్ చేయాలని ప్లాన్ చేస్తోంది. అందుకే జట్టులో మార్పులు చేర్పులకు డిసెంబర్‌లో జరిగే వేలంలో పాల్గొనేందుకు కసరత్తు షురూ చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కోసం డిసెంబ్‌లో మినీ వేలం నిర్వహిస్తారు. ఇందులో ఆటగాళ్లను కొనుగోలు చేసి జట్లలో కొన్ని మార్పులు చేయాలని అన్ని టీంలు చూస్తాయి. వేలంలో పాల్గొనేందుకు వీలుగా ముందు జట్లు కొంతమంది ఆటగాళ్లను రిలీజ్ చేస్తాయి. అలాంటి పనే ఆర్సీబీ కూడా చేయబోతోంది. ఆర్సీబీ నలుగురు ఆటగాళ్లను విడుదల చేయవచ్చని తెలుస్తోంది. ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను ఇండియన్ ప్రీమియర్ లీగ్2025 కంటే ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 8.75 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. అతను 2022 నుంచి 2024 వరకు పంజాబ్ కింగ్స్ తరఫున 11.50 కోట్లకు ఆడాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో అతని ప్రదర్శన తీవ్ర నిరాశపరిచింది, చనాలను అందుకోలేకపోయింది. అతను 8 ఇన్నింగ్స్‌లలో 112 పరుగులు చేశాడు. తన బౌలింగ్‌లో పెద్దగా రాణించలేకపోయాడు. కేవలం 2 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అందుకే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 వేలానికి ముందు లివింగ్‌స్టోన్‌ను విడుదల చేయాలని ఆర్సీబీ భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. గత సీజన్‌లో గాయపడిన దేవదత్ పాడిక్కల్ స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మయాంక్ అగర్వాల్‌ను నియమించుకుంది. అతను 2025లో ఆర్సీబీ తరఫున నాలుగు మ్యాచ్‌లు ఆడాడు, 148.43 స్ట్రైక్ రేట్‌తో 95 పరుగులు చేశాడు. తదుపరి సీజన్‌కు పాడిక్కల్ అందుబాటులో ఉంటాడు, కాబట్టి వేలానికి ఎక్కువ డబ్బు సంపాదించడానికి జట్టు మయాంక్‌ను విడుదల చేయడాన్ని మొగ్గు చూపే అవకాశం ఉంది. మయాంక్ అగర్వాల్ రికార్డులో ఐదు జట్లకు 131 మ్యాచ్‌లు ఉన్నాయి, 2,756 పరుగులు చేశాడు. అతను ఒక సెంచరీ మరియు 13 హాఫ్ సెంచరీలు చేశాడు. దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ లుంగి ఎంగ్డి మంచి బౌలర్, కానీ అతను పెద్దగా ప్రభావం చూపలేదు. అతన్ని మొదట చెన్నై, తరువాత ఢిల్లీ క్యాపిటల్స్ 50 లక్షలకు కొనుగోలు చేశాయి. గత ఎడిషన్‌కు ముందు, అతన్ని బెంగుళూరు 1 కోటి రూపాయలకు కొనుగోలు చేసింది. ఇది అతని బేస్ ప్రైస్. అయితే, అతను మొత్తం సీజన్‌లో కేవలం 2 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు, 4 వికెట్లు తీసుకున్నాడు. రికార్డుల గురించి చెప్పాలంటే, 2018 నుంచి ఆడుతున్న లుంగి ఎంగ్డీ 16 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు, ఏ సీజన్‌లోనూ అతను అన్ని మ్యాచ్‌లు ఆడలేదు. ఆ మ్యాచ్‌లలో అతనికి 29 వికెట్లు ఉన్నాయి.బెంగుళూరు వేలానికి ముందు అతన్ని విడుదల చేయవచ్చు.లియామ్ లివింగ్‌స్టోన్ 49 మ్యాచ్‌లలో ఏడు హాఫ్ సెంచరీలతో సహా 1051 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 158.76, 13 వికెట్లు కూడా తీసుకున్నాడు.

# అభిషేక్ శర్మ రికార్డుల మోత..



భారత ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్లో వీర విహారం చేశాడు. ఆదివారం రాత్రి పాక్‌తో జరిగిన మ్యాచులో అభిషేక్ 39 బంతుల్లో 74 పరుగులు చేసి హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. ఈ ఇన్నింగ్స్ లో తొలి బంతికే సిక్స్ కొట్టి ఔరా అనిపించాడు. అంతర్జాతీయ టీ20ల్లో తొలి బంతికి రెండు మ్యాచ్‌లలో సిక్స్‌లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు.అభిషేక్ నిన్నటి %×చీణ జం ్రాూఖ% మ్యాచులో 6 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు. ఈ భారత బ్యాట్స్‌మన్ కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. దీంతో పాకిస్తాన్ మీద అత్యంత వేగంగా అర్ధ సెంచరీ సాధించిన భారత బ్యాటర్‌గా ఘనత సాధించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌కుగానూ అభిషేక్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. పాకిస్తాన్తో జరిగిన మ్యాచ్లో తన గురువు యువరాజ్ రికార్డును కూడా అభిషేక్ శర్మ బద్దలు కొట్టాడు. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఎల్లప్పుడూ హై-వోల్టేజ్ పోరు తప్పదు. ఈ మ్యాచ్లో ఆటగాళ్లు భారీ పరుగుల కోసం ప్రయత్నిస్తారు. అదే సమయంలో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్లో అత్యంత వేగంగా అర్ధ శతకాలు బాదిన ఆటగాళ్లలో 2 దేశాల బ్యాటర్లు ఉన్నారు. ఈ జాబితాలో మహ్మద్ హఫీజ్ నెంబర్ వన్ గా ఉన్నాడు.భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్లో అత్యంత వేగంగా అర్ధ శతకం సాధించిన రికార్డు పాకిస్తాన్ బ్యాటర్ మహమ్మద్ హఫీజ్ పేరిట ఉంది. హఫీజ్ 2012లో అహ్మదాబాద్ వేదికగా 23 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు.భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. అభిషేక్ పాకిస్తాన్తో నిన్న జరిగిన మ్యాచ్లో దాదాపు 190 స్ట్రైక్ రేట్‌తో 74 పరుగులు చేశాడు. అభిషేక్ కేవలం 24 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు.భారత ఆల్ రౌండర్ బ్యాటర్ యువరాజ్ సింగ్ ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచాడు. యువరాజ్ 2012లో అహ్మదాబాద్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 29 బంతుల్లో అర్ధ శతకం చేశాడు. పాకిస్తాన్ బ్యాటర్ ఇఫ్తిఖర్ అహ్మద్ ఈ జాబితాలో 4వ స్థానంలో నిలిచాడు. ఇఫ్తిఖర్ 2022లో మెల్‌బోర్న్ వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్లో 32 బంతుల్లో అర్ధ శతకం బాదాడు. పాకిస్తాన్ బ్యాటర్ మిస్బా ఉల్ హక్ ఈ జాబితాలో 5వ స్థానంలో ఉన్నాడు. 2007లో దర్బన్లో జరిగిన మ్యాచులో మిస్బా 33 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు.పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచులో వేగంగా హాఫ్ సెంచరీ చేసిన భారత బ్యాటర్ గా నిలిచాడు. అంతర్జాతీయ టీ20ల్లో తొలి బంతికే సిక్సర్లు రెండు మ్యాచులలో కొట్టిన తొలి భారత బ్యాటర్ అభిషేక్. దాంతో పాటు అత్యంత వేగంగా 50 సిక్సర్లు బాదిన తొలి బ్యాటర్ కూడా ఇతడే. టీ20ల్లో ఎదుర్కొన్న అతి తక్కువ బంతుల్లోనే 50 సిక్స్‌లు బాదిన రికార్డు సాధించాడు. తాను ఎదుర్కొన్న 331 బంతుల్లో అభిషేక్ శర్మ 50 సిక్సర్లు బాదాడు. గతంలో ఈ రికార్డు వెస్టిండీస్ బ్యాటర్ ఎవిన్ లూయిస్ (366 బంతుల్లో) పేరిట ఉండేది. ఈ జాబితాలో 3వ స్థానంలో రస్సెల్, 5వ స్థానంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు.

# పాకిస్థాన్ జట్టుపై షోయబ్ అక్తర్ విమర్శలు



టీమిండియా చేతిలో మరోసారి ఓడిన పాకిస్థాన్ జట్టుపై ఆ టీమ్ మాజీ పేసర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ విమర్శలు గుప్పించాడు. అసలు టీమ్‌మేనేజ్‌మెంట్ ఏం ఆలోచిస్తుందో తనకు అర్థం కావడం లేదని, పదే పదే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డాడు. బ్యాటింగ్, బౌలింగ్ ఏది సరిగ్గా లేదని విమర్శించాడు. తమ కెప్టెన్ సల్మాన్ అలీ అఘానే పెద్ద బొకడా గాడని, అతని వల్ల జట్టుకు నష్టం తప్పా ఒరిగేదేం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన సూపర్-4 పోరులో అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత్ 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ కాస్త పోటీ ఇచ్చినా.. భారత్ జోరుకు కళ్లెం వేయలేకపోయింది. అభిషేక్ శర్మ విధ్వంసకర హాఫ్ సెంచరీతో పాకిస్థాన్‌కు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అక్తర్.. పాకిస్థాన్ టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఆటగాళ్లపై ఘాటైన విమర్శలు చేశాడు.'పాకిస్థాన్ టీమ్ మేనేజ్‌మెంట్ ఏం ఆలోచిస్తుందో నాకు అస్సలు అర్థం కావడం లేదు. పదే పదే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. మిడిలార్డర్ సరిగ్గా ప్లాన్ చేయలేదు. పవర్‌ప్లేను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం లేదు. బౌలర్లను కూడా తెలివిగా ఉపయోగించడం లేదు. ఆటగాళ్ల మధ్య సరైన సమన్వయం లేదు. బౌలింగ్ లైన్స్, లెంగ్త్‌లు చాలా పేలవంగా ఉన్నాయి. ఒక చెత్త బౌన్సర్‌తో బౌలింగ్ ప్రారంభించి మూల్యం చెల్లించుకున్నారు. ఆ తర్వాత పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. సల్మాన్ అలీ అఘా ఏం కెప్టెన్సీ చేస్తున్నాడో అతనికే తెలియాలి. అతనే జట్టులో బలహీనమైన వ్యక్తి. అతను ఆడుతున్న స్థానానికి అసలు అర్హుడేనా. జట్టులో అతను ఏం చేస్తున్నాడు.. అతని మంచి వ్యక్తి కావచ్చు. కానీ ఏం లాభం.. జట్టు కోసం ఏం చేస్తున్నాడు.. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యాలా రాణిస్తున్నాడా కెప్టెన్‌గా అతను తీసుకునే నిర్ణయాలు జట్టును మరింత కష్టాల్లోకి నెట్టుతున్నాయి.'అని అక్తర్ విమర్శించాడు. భారత బ్యాటర్ల విధ్వంసంతో కెప్టెన్‌గా సల్మాన్ అలీ అఘా తడబడ్డాడు. పదే పదే బౌలర్లను మార్చాడు. అంతేకాకుండా లీగ్ దశలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అప్పుడు కూడా అక్తర్ సల్మాన్ అలీ అఘాపై విమర్శలు గుప్పించాడు. 'మా ఐన్‌స్టీన్ బౌలింగ్ ఎంచుకోకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు.'అని సెటైర్లు పేల్చాడు.

# పాకిస్థాన్‌తో మాకు పోటీ ఏంటి..?

### టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్




భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ఇకపై బిగ్గెస్ట్ రైవలరీ మ్యాచ్ కాదని టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నారు. ఇరు జట్ల గెలుపోటములు తెలుసుకుంటే.. ఇది గొప్ప రైవలరీ అవ్వదని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు పాకిస్థాన్ ఫ్యాన్స్ మండిపోయేట్టు చేస్తున్నాయి.ఆసియా కప్ 2025 సూపర్ 4 రౌండ్‌లో భారత్ తన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించింది. ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో వారు 172 పరుగుల లక్ష్యాన్ని సులభంగా సాధించారు. పాకిస్తాన్‌పై భారత జట్టు భారీ విజయం సాధించిన తర్వాత.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రెస్ కాన్ఫిరెన్స్‌లో పాకిస్థాన్ జట్టుపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. పాక్ జట్టుపై చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ఫ్యాన్స్ విపరీతంగా వైరల్ చేస్తున్నారు. భారతదేశం-పాకిస్తాన్ మ్యాచ్ రైవలరీ మ్యాచ్ కాదని.. పాకిస్థాన్ బలమైన జట్టు కాదని ఆయన చేసిన ప్రకటనతో పాకిస్థాన్ ఫ్యాన్స్ అందరూ మండిపడుతున్నారు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా ఫ్యాన్స్ మాత్రం పండగ చేసుకుంటున్నారు. ఆదివారం దుబాయ్‌లో జరిగిన మ్యాచ్‌లో సల్మాన్ అలీ అఘా కెప్టెన్సీలోని పాకిస్థాన్ జట్టును టీమ్‌ఇండియా మరోసారి మట్టికరిపించింది. ఈ పరిస్థితిలో మ్యాచ్ తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో ఒక పాకిస్తాన్ జర్నలిస్ట్ భారతదేశం-పాకిస్తాన్ మ్యాచ్ గురించి ఒక ప్రశ్నను లేవనెత్తారు. సూర్యకుమార్ ఆలోచించకుండా.. "నేను ఈ ప్రశ్నకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. మీరందరూ భారతదేశం-పాకిస్తాన్ మ్యాచ్ గురించి ప్రశ్నలు అడగడం మానేయాలని నేను భావిస్తున్నాను" అని స్పందించారు. "రెండు జట్లు 15-20 మ్యాచ్‌లు ఆడగా.. గెలుపు-ఓటముల రికార్డు 7-7 లేదా 8-7 అయితే, అది మంచి రైవలరీ మ్యాచ్ అంటారు. అలాంటివి అసలైన మ్యాచ్‌లు. కానీ గెలుపు-ఓటముల రికార్డు 13-0 లేదా 10-1 లాగా ఏకపక్షంగా ఉంటే.. దానిని రైవలరీ మ్యాచ్ అని ఎలా పిలుస్తారు మేము వారి కంటే మెరుగైన క్రికెట్ ఆడాము" అని టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కుండబద్దలు కొట్టారు. గత ఎనిమిది రోజుల్లో భారత్ రెండుసార్లు పాకిస్థాన్‌ను ఓడించినందున సూర్యకుమార్ కామెంట్స్ ఇప్పుడు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. సూపర్ 4 రౌండ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 171 పరుగులు చేసింది. 172 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 18.5 ఓవర్లలోనే విజయం సాధించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మాన్ గిల్ ల కృషితో ఈ విజయం సాధ్యమైంది. పాకిస్థాన్ తరఫున సాహిబ్‌జాదా ఫర్హాన్ ప్రశాంతంగా అర్ధ సెంచరీ సాధించాడు. కానీ మిగతా ఆటగాళ్లెవరూ ఆకట్టుకోలేకపోయారు. భారత పార్ట్ టైమ్ బౌలర్ శివమ్ దూబే కీలక వికెట్లు తీసి పాకిస్థాన్ పరుగుల వేగాన్ని తగ్గించాడు. గత 15 ఏళ్లలో భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన 31 మ్యాచ్‌లలో భారత్ ఆధిపత్యం చెలాయించింది. 23 మ్యాచ్‌లలో విజయం సాధించింది. టెస్టులు, వన్డేల్లో పాకిస్తాన్ మొత్తం మీద ఆధిక్యంలో ఉండగా.. టీ20ల్లో భారత్ 15 మ్యాచ్‌లలో 11 మ్యాచ్‌లలో విజయం సాధించి తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఈ గణాంకాలు సూర్యకుమార్ యాదవ్ వాదనకు బలం చేకూరుస్తున్నాయి.



# రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న క్వింటన్ డికాక్

సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ క్వింటన్ డికాక్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వన్డే రిటైర్మెంట్ వెనక్కితీసుకుంటున్నట్లు ప్రకటించాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ టోర్నీతో వన్డేలకు గుడ్ బై చెప్పాడు. ఆ తర్వాత ఏడాది అమెరికా, వెస్టిండీస్ సంయుక్త వేదికగా జరిగిన 2024 టీ20 వరల్డ్‌కప్‌లో ఆడాడు. ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్ తర్వాత సఫారీ జట్టు తరఫున డికాక్ మళ్లీ బరిలోకి దిగలేదు. ఇప్పుడు రిటైర్మెంట్ వెనక్కితీసుకోవడంతోనే వచ్చే నెలలో పాకిస్థాన్‌తో జరగనున్న టీ20, వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. అయితే టీ20 వరల్డ్‌కప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌లో ఆడకపోయినా, రిటైర్మెంట్ మాత్రం ప్రకటించలేదు. ఇక టెస్టులకు 2021లోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. అదే ఏడాది టెస్టుల్లో సౌతాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించాడు. గతేడాది డికాక్‌కు సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకోలేదు. ఇక తాజాగా రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న వెంటనే రెండు ఫార్మాట్లలో జట్టులో చోటు దక్కించుకున్నాడు. వరల్డ్‌కప్ టోర్నమెంట్లకు ముందు డికాక్ తిరిగిరావడం సౌతాఫ్రికా జట్టుకు బూస్ట్ ఇస్తుందనే చెప్పుకోవాలి.అయితే వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్, ఆపై సంవత్సరం వన్డే ప్రపంకకప్ టోర్నమెంట్ ఉన్న నేపథ్యంలో డికాక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, సౌతాఫ్రికా వచ్చే నెల నమీబియా, పాకిస్థాన్ పర్యటనలకు వెళ్లాల్సి ఉంది. ఇందులో అక్టోబర్ 11న నమీబియాతో ఏకైక టీ20, ఆ తర్వాత పాక్ టూర్‌లో రెండు టెస్టులు, మూడు టీ20, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. పాక్ పర్యటన అక్టోబర్ 12న ప్రారంభమై నవంబర్ 08న ముగుస్తుంది. కాగా, 2013లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. మొత్తం 155 వన్డేల్లో 45.75 సగటుతో 6770 పరుగులు చేశాడు. ఇందులో 21 సెంటరీలు, 30 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక టీ20ల్లో 92 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 2584 పరుగులు, 54 టెస్టుల్లో 3300 రన్స్ చేశాడు. అయితే 2021లో డికాక్ ఆఖరి టెస్టు ఆడాడు. ఆ తర్వాత మళ్లీ టెస్టుల్లో చోటు దక్కించుకోలేదు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో డికాక్ పలు రికార్డులు ఖాతాలో వేసుకున్నాడు. వరల్డ్‌కప్‌లో హిస్టరీలో అత్యధిక సెంచరీలు బాదిన దక్షిణాఫ్రికా క్రికెటర్ల జాబితాలో రెండో స్థానం సాధించాడు. దిగ్గజ బ్యాటర్ ఏబీ డివిలియర్స్(4) తర్వాత హాషీం ఆమ్లా (2), ఫాఫ్ డుప్లెసిస్ (2), హర్షల్ గిబ్స్ (2)తో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు.

# కాంతారా చాప్టర్ 1 ట్రైలర్ విడుదల




2022లో రికార్డు సృష్టించిన 'కాంతర'.. మరోసారి దాన్ని రిపీట్ చేసేందుకు సిద్ధమైంది. దీనికి ప్రీక్వెల్‌గా 'కాంతార చాప్టర్ 1' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో ముస్తాబవుతోన్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. రిషబ్ తన నటనతో ఆకట్టుకుంటున్నారు. రుక్మిణి వసంత్ మహారాణి పాత్రలో కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. శాండల్‌వుడ్ మల్టీ టాలెంటెడ్ సెలబ్రిటీల్లో టాప్‌లో ఉంటాడు రిషబ్ శెట్టి. కాంతార సినిమాతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన రిషబ్ శెట్టి ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో కాంతార చాప్టర్ 1లో నటిస్తున్నాడు. ఈ మూవీ అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది రిషబ్ శెట్టి టీం.

# మీ ప్రేమాభిమానాలే ఇంతవాడిని చేశాయి

## 47 ఏళ్ల చిత్ర ప్రయాణంపై చిరు ఎమోషన్




తన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' విడుదలై నేటికి 47 ఏళ్లు అయిన సందర్భంగా అగ్ర కథానాయకుడు చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఆ చిత్రాన్ని గుర్తుచేసుకుంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నటుడిగా తనకు ఈ చిత్రం ప్రాణం పోసిందన్నారు. 22 సెప్టెంబర్ 1978.. కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే నేను 'ప్రాణం ఖరీదు' చిత్రంతో మీకు పరిచయమయ్యాను. ఈ సినిమా విడుదలై నేటికి 47 ఏళ్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ సినిమా ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి.. మీ అన్నయ్యగా, కొడుకుగా, మీ కుటుంబ సభ్యుడిగా, ఒక మెగాస్టార్‌గా.. అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు ఎప్పుడూ కృతజ్ఞుడినై ఉంటాను. నేటికి 155 సినిమాలను నేను పూర్తి చేసుకున్నాను అంటే.. అందుకు కారణం నిస్వార్థమైన మీ ప్రేమే. ఈ 47 ఏళ్లలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవ మర్యాదలు నావి

కావు, మీ అందరివీ, మీరందించినవి. మనందరి మధ్య ఈ ప్రేమానుబంధం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. చిరంజీవి కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'పునాది రాళ్లు'. అయితే, ఆ తర్వాత నటించిన 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదల కావటం గమనార్హం. కె.వాసు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో చిరు నరసింహ అనే పాత్రను పోషించారు. రావుగోపాలరావు, జయసుధ, చంద్రమోహన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమా విడుదలై 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరుకు సోషల్ మీడియాలో సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపుడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు'లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది ప్రేక్షకుల ముందుకురానుంది . అలాగే వశిష్ట దర్శకత్వంలో 'విశ్వంభర'తో సందడి చేయనున్నారు. 2026 వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ రెండింటితో పాటు– శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి.




# దుల్కర్ నా బెస్ట్ ఫ్రెండ్

## కొత్తలోక హీరోయిన్ కళ్యాణి

మలయాళీ బ్యూటీ అయినప్పటికి కల్యాణి ప్రియదర్శన్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం.హలో, చిత్రలహరి, రణరంగం సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ భామ, తాజాగా విడుదలైన 'కొత్త లోక'లో సూపర్ ఉమెన్ పాత్రతో అలరించింది. ఇంతవరకు ప్రధానంగా సరదా పాత్రలు చేసిన ఆమె, ఈ సినిమాలో తొలిసారి యాక్షన్ సీన్లలో కనిపించడం ప్రత్యేకం. అయితే ఇటీ–వల ఇంటర్వ్యూలో కల్యాణి తన కెరీర్‌తో పాటు– వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకుంది. మా స్వస్థలం కేరళ అయినప్పటికీ నేను చెన్నై లో పుట్టి పెరిగాను. అమ్మానాన్న ఇండస్ట్రీలో ఉండటంతో చిన్నప్పటి నుంచే షూటింగ్ సెట్స్ వాతావరణం నాకు పరిచయం. అక్కడి నుంచే సినిమాలపై ఆసక్తి పెరిగింది. 2017లో 'హలో' ద్వారా టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టాను. అప్పటి వరకు ఎక్కువగా లైట్ హార్ట్‌డ్ రోల్స్ మాత్రమే చేసాను. కానీ 'కొత్త లోక' కోసం నేను ఆరు నెలలు స్పెషల్ ట్రైనింగ్ తీసుకుని యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఇది నాకు కొత్త అనుభవం అని చెప్పింది. అలాగే తన స్నేహితుడు దుల్కర్ సల్మాన్ గురించి మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీలో నాకు దుల్కర్ బెస్ట్ ఫ్రెండ్. నాకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా, లేదా ఏదైనా సలహా కావాలన్నా మొదటి ఫోన్ దుల్కర్‌కే చేస్తాను. ఆయన నాకు చాలా సపోర్ట్‌గా ఉంటారని చెప్పి తన బంధాన్ని బయటపెట్టింది. కల్యాణి ప్రస్తుతం మలయాళం, తెలుగు సినిమాల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ, విభిన్న పాత్రల ద్వారా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది.

# 'బ్రహ్మానందం' పాపులర్ డైలాగ్‌తో సాంగ్




ప్రియదర్శి నిహారిక ఎన్‌ఎమ్ కలిసి నటిస్తోన్న కొత్త చిత్రం 'మిత్ర మండలి'. కామెడీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు విజయేందర్ తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాంగ్‌ను విడుదల చేశారు. 'జంబర్ గింబర్ లాలా' లిరిక్స్‌తో ఉన్న ఈ సాంగ్ అందరినీ మెప్పించేలా ఉంది. శ్రీనువైట్ల తెరకెక్కించిన 'వెంకీ' సినిమాలో గజాలా పాత్రలో బ్రహ్మానందం తన కామెడీతో అదరగొట్టారు. ఆ మూవీలో 'జంబర్ గింబర్ లాలా' అంటూ బ్రహ్మీ పాడే సాంగ్ ఇప్పటికీ సోషల్‌మీడియాలో తెగ వైరలవుతోంది. తాజాగా ఇదే లైన్‌తో ఏకంగా సాంగ్ లో వాడారు. హీరో ప్రియదర్శి, 'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం మిత్ర మండలి. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా సిద్దార్థ్ ఎస్.జె, ఎడిటర్‌గా పీకే వ్యవహరిస్తున్నారు. 'మిత్ర మండలి' అనేది స్నేహం ప్రధానంగా నడిచే కథ. ఇది ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది. అక్టోబర్ 16న ఈ చిత్రం విడుదల కానుంది.




# పవన్ కల్యాణ్ "ఓజీ" తుపాను మొదలైంది..

## ఫైనల్ ట్రైలర్‌తో మాస్ హంగామా !

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిన్న (సెప్టెంబర్ 21) జరిగిన ఓజీ ప్రీ–రిలీజ్ ఈవెంట్ అభిమానులకు మరచిపోలేని తీపి జ్ఞాపకాన్ని అందించింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ రిలీజ్ చేయాలని మేకర్స్ భావించిన పూర్తి వర్క్ కాకపోవడం వలన పోస్ట్ చేయాలని అనుకున్నారు. కాని పవన్ కళ్యాణ్ సూచన మేరకు అప్పటి వరకూ రెడీ అయిన ట్రైలర్‌ను అక్కడే విడుదల చేయడం జరిగింది. ఇక కొద్ది సేపటి క్రితం ఫైనల్ వెర్షన్ "ఓజీ" థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. ఇది విడుదలవ్వగానే సోషల్ మీడియాను, సినిమా వర్గాలను పూర్తిగా షేక్ చేస్తోంది. దర్శకుడు సుజీత్ ఫుల్ మేకోవర్, తమన్ అదిరే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పవన్ కళ్యాణ్ పవర్‌ఫుల్ డైలాగ్స్, విలన్ లుక్స్ ఈ ట్రైలర్‌ను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లాయి. ట్రైలర్‌లో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ అవతారం, స్టైల్ , తమన్ మ్యూజిక్ , రిచ్ విజువల్స్ , క్లాస్ టు మాస్ పాకేజింగ్, చివర్లో పవన్ చెప్పిన "నా కొడకల్లారా..!" పంచ్ డైలాగ్ పూనకాలు తెప్పిస్తున్నాయి. ఈ డైలాగ్ విన్నవెంటనే అభిమానుల్లో గూస్‌బంప్స్ పుట్టించడంతో పాటు, ట్రైలర్‌కు ఊహించని రేంజ్‌లో బజ్ తీసుకొచ్చింది. గతంలో "లాస్ట్ పంచ్ మనదైతే వచ్చే కిక్కే వేరప్పు" లాంటి డైలాగ్ ఎంత హైప్ తీసుకువచ్చిందో, ఇదీ అదే స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.ఏపీ డిప్యూటీ సీఎం పదవి చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి ఈ స్థాయి మాస్ యాంగిల్ రావడం అభిమానుల్లో సంబరాలు తెచ్చిపెట్టింది. రాజకీయంగా బిజీగా ఉన్నప్పటికీ, పవన్ తన అభిమానుల కోసం, "ఓజీ" చిత్రాన్ని పట్టుదలగా తీసుకొని పూర్తి చేశాడు. సినిమా పై ఆయన ఉన్న డెడికేషన్ ట్రైలర్‌తో తెలిసిపోతుంది.

ప్రస్తుతం "ఓజీ" ట్రైలర్ ట్రెండింగ్‌లో టాప్‌లో ఉంది. ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ప్రతి ప్లాట్‌ఫామ్‌లోనూ "ఓజీ" ట్రైలర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చాలామంది ఫ్యాన్స్, సినీ విశ్లేషకులు ఒకే మాట అంటున్నారు .."ఇది తొలిరోజే ?100 కోట్లు రాబట్టే సినిమా!" అని కామెంట్ చేస్తున్నారు. సెప్టెంబర్ 25న, విజయదశమి కానుకగా "ఓజీ" గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. విడుదలకు ముందే ఈ స్థాయిలో హైప్ ఉండడం సినీ ఇండస్ట్రీకి ఒక పెద్ద విషయమే. "గెట్ రెడీ%ూ% పవన్ కళ్యాణ్ 'ఓజీ'తో తెరపై మాస్ తుఫాన్‌ను ఎవరూ ఆపలేరు అంటూ అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.